website2:www.netinijam.com
ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433
E-mail : netinijam93@gmail.com

# నేటి నిజం
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ శుక్రవారం 12-1-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:126 పేజీలు:6 వెల: రూ.1/-

**చురక**

ప్రపంచ ఆర్థిక
పరుగుకు ఇంజన్
భారత్ అవునా
ప్రగతి ప్రభంజన్.

అదానీ అంబాని
ఆర్థిక సంపృద్ధి
ప్రధాని దానినే
పలికే అభివృద్ధి

-వేల్పుల నారాయణ
9440433475

## రెండు చోట్ల ఓటు ఉంటే క్రిమినల్ చర్యలు: సీఈసీ

న్యూ ఢిల్లీ జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రెండు చోట్ల ఓటు ఉంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కేంద్ర ఎన్నికల సంఘం హెచ్చరించింది.తెలంగాణ ఎన్నికల్లో ఓటు వేసినవారు ఏపీ ఎన్నికల్లో ఎలా ఓటు వేస్తారు...? అని ప్రశ్నించింది.ఏపీలో ఆస్తులు ఉన్నంత మాత్రానా..ఏపీలో నివాసం ఉండకుండా ఉంటే..ఓటు ఇవ్వలేం అని స్పష్టం చేసింది.ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 4.07 కోట్ల మంది ఓటర్లు కాగా ఇందులో లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగ ఉన్నారని తెలిపింది. మహిళా ఓటర్లు2.07 కోట్లు, పురుష ఓటర్లు 1.99 కోట్లుఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు..5.8 లక్షల మందికి అవకాశం7.88 లక్షల మందికి ..తొలిసారి ఓటు హక్కువందేళ్లు దాటిన వృద్ధులు1174 మందిఈ నెల 22న ఓటర్ల తుది జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపింది.

## ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలిసిన గూగుల్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తోట



హైదరాబాద్ జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);గూగుల్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తోట గురువారం సీఎం నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులపై గూగుల్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తోట సీఎంతో చర్చించి ప్రభుత్వంతో కలిసి పనిచేయండనికి సంసిద్ధతను వ్యక్తం చేసారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రతి రంగాన్ని ప్రభావితం చేస్తుందని, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం వంటి అంశాలలో తెలంగాణ కోసం డిజిటలైజేషన్ ఎజెండాను అభివృద్ధి చేయడంలో భాగస్వాములు కావడంతోపాటు తెలంగాణ పౌరుల అవసరాలను తీర్చడానికి నాణ్యమైన సేవలను అందించడానికి విస్తృత సాంకేతికత, నైపుణ్యం తమతో ఉందని చంద్రశేఖర్ సిఎంకు వివరించారు. గూగుల్ మ్యాప్స్ , గూగుల్ ఎర్త్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించి సాధ్యమయ్యే రహదారి భద్రత పై కూడా ముఖ్యమంత్రి చర్చించారు. ఈ సమావేశంలో మంత్రులు డి.శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 14 నుంచి రాహుల్ గాంధీ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ప్రారంభం

హైదరాబాద్ జనవరి (ఎక్స్ ప్రెస్ న్యూ స్):కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ'భారత్ జోడో న్యాయ్ యాత్ర' జనవరి 14న మణిపూర్ నుంచి ప్రారంభం కానుందని ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి శమా అహ్మద్ పేర్కొన్నారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ మేరకు తెలిపారు. మణిపూర్‌లో ప్రారంభమయ్యే ఈ యాత్ర దేశంలోని 15 రాష్ట్రాల గుండా కొనసాగి ముంబయిలో ముగుస్తుందన్నారు. ఈ క్రమంలో యాత్రలో భాగంగా 110 జిల్లాలు, 100 లోక్‌సభ స్థానాలు, 337 అసెంబ్లీ స్థానాలను కవర్ చేయనున్నట్లు చెప్పారు. ఈ యాత్ర కోసం కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధం కావాలని సూచించారు.అంతేకాదు ఈ యాత్రలో భాగంగా దేశంలోని సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలను ప్రస్తావించనున్నట్లు చెప్పారు. దీంతోపాటు దేశంలో యువత ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వం ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసిందని శమా అహ్మద్ ఆరోపించారు. మరోవైపు నిత్యావసరాల ధరలతోపాటు ఇంధన ధరలు కూడా భారీగా పెరిగిపోయాయని అన్నారు.ప్రధాని మోదీ అబద్ధాలు చెబుతూ సామాన్య ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి విమర్శించారు. దీంతోపాటు పలు చోట్ల ఆదివాసీ, అల్ప వర్గాల మీద దాడులు జరుగుతున్నాయని అన్నారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో మహిళలపై జరిగిన హైదరాబాద్, జనవరి 11:దాడులకు న్యాయం జరగడం లేదని ఎద్దేవా చేశారు. అంతేకాదు ప్రశ్నించిన వారి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇక బ్రిజ్ భూషణ్ విషయంలో ఆధారాలతో సహా తప్పిదాలు జరిగినట్లు ఫిర్యాదులు అందినా కూడా ఇప్పటివరకు అతనిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని శమా అహ్మద్ ప్రశ్నించారు.

## తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఉపఎన్నికకు నోటిఫికేషన్ జారీ

### -ఈనెల 18 వరకు నామినేషన్ స్వీకరణ
### -జనవరి 29న ఎన్నికలు...అదే రోజు ఫలితాలు

హైదరాబాద్, జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఉపఎన్నికకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. గురువారం ఉదయం అసెంబ్లీ కార్యాలయం ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. రెండు ఎమ్మెల్సీలకు విడివిడిగా నోటిఫికేషన్ జారీ అయ్యింది. నేటి నుంచి ఈనెల 18 వరకు నామినేషన్లకు గడువు. ఈనెల 22న నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీగా నిర్ణయించారు. జనవరి 29న ఎన్నికలు జరుగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎన్నిక జరుగనుంది. పోలింగ్ ముగిసిన తర్వాత అదే రోజు సాయంత్రం కౌంటింగ్.. ఫలితం వెలువడనుంది.కాగా.. స్టేషన్ ఘన్‌పూర్ నుంచి కడియం శ్రీహరి, హుజూరాబాద్ నుంచి పాడి కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. దీంతో ఇద్దరు ఎమ్మెల్సీ స్థానాలకు రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.

## పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి : ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి



జోగులాంబ గద్వాల , జనవరి 11:జిల్లా దవాఖానలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సంతోష్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని దౌదర్‌పల్లి సమీపంలో 300 వందల పడకల దవాఖాన నిర్మాణం పనులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 300 పడకల ఆసుపత్రి నిర్మాణం పనులు పూర్తయ్యాయని తెలిపారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టికి పెంచడం వల్ల గ్రామీణ ప్రాంతాలలో కూడా ప్రజలకు మెరుగైన వైద్యం అందించే విధంగా కృషి చేస్తామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ దవాఖానలో అన్ని రకాల వైద్యానికి సంబంధించిన పరికరాలను అందుబాటులో ఉంచి ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందించాలన్నారు.

అనంతరం వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్,ఆర్.డి.ఓ చంద్రకళ, డీఎంహెచ్‌వో శశికళ, మున్సిపల్ కమిషనర్ నరసింహ, తాహసిల్దార్ వెంకటేశ్వర్లు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కమల, హాస్పిటల్ సూపరింటెండ్ డాక్టర్ కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

## ఖర్గేతో తెలంగాణ కాంగ్రెస్ నేతలు సమావేశం

### -ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ: మంత్రి పొన్నం



న్యూఢిల్లీ జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తో తెలంగాణ కాంగ్రెస్ నేతలు గురువారం నాడు సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి సంబంధించిన పలు విషయాలను మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాకు వివరించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు తెలిపారు. ప్రచారం ఎలా ఉండాలి, పోల్ మేనేజ్మెంట్, ప్రజలతో మమేకం అవ్వడంపై ఖర్గే మార్గానిర్దేశం చేశారన్నారు. దేశ ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలు భావిస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 17 కి 17 ఎంపీ స్థానాలు గెలవడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే రాష్ట్రానికి మరిన్ని నిధులు వస్తాయని తెలిపారు. రెండు, మూడు స్థానాల కోసం బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మధ్య పోటీ ఉందని అన్నారు. గత ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసిందని చెప్పారు. 17 కి 17 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఆరు గ్యారెంటీలతోపాటు మరిన్ని సంక్షేమ పథకాలు అందించేందుకు అవకాశం ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

### లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన అంశాలపై చర్చించాం: మంత్రి ఉత్తమ్

తెలంగాణలో 70 స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తుందని మొదట చెప్పింది తానేనని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా పార్లమెంటు సీటును 3 లక్షల ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ గెలుస్తుందని తెలిపారు. 14 లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ గెలుచు కుంటుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన అంశాలపై చర్చించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు.

## దళిత, బీసీ బంధు పథకాలను అమలు చేయాలి : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బాలానగర్ (హైదరాబాద్) : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన దళిత, బీసీ బంధు పథకాలను అమలు చేసి పేదలను ఆదుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రతిఘటిస్తామని ఆయన అన్నారు. గురువారం బాలానగర్ డివిజన్ వినాయక్‌నగర్‌లోని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీఆర్ఎస్ కార్యకర్తలు తనపై అచంచల విశ్వాసంతో ఎన్నికల్లో? ప్రచారం చేసి గెలుపునకు ఎంతో కృషి చేశారని అన్నారు. నియోజకవర్గంలో మొత్తం 418 బూతులుండగా అన్నింటిలో మెజార్టీ తో గెలిపించి హాట్రిక్ సాధించడానికి దోహదపడ్డారని కొనియాడారు. శాసనసభ ఎన్నికలలో తన గెలుపు కోసం కృషి చేసిన పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని స్పష్టం చేశారు.ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా వాటిని పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో జరిగిన అభివృద్ధి జరిగింది ప్రజలందరికీ తెలుసని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దర్శనం శాకయ్య, ఎండీ ఖాజా, సీనియర్ నాయకులు మందడి సుధాకర్‌రెడ్డి, దారం వెంకటేశం గుప్తా , పంజా రాంచందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 31లోపు ఆయా వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలి

హైదరాబాద్ జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో వ్యాపారం నిర్వహిస్తున్న యాజమానులకు అధికారులు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం ఉన్న ట్రేడ్ లైసెన్స్ డిసెంబర్ 31, 2023తో ముగిసిందని గుర్తు చేశారు. ఈ క్రమంలో కొత్తగా జనవరి 31, 2024లోపు ఆయా వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. చెల్లింపు తర్వాత ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికేట్ జారీ చేయబడుతుందని అన్నారు. ఇది జనవరి 2024 నుంచి డిసెంబర్ 2024 వరకు చెల్లుబాటు అవుతుందని చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నార్మ్స్ (EODB) అమలుపై MA&UD జూన్ 22, 2017 నాటి G.O.Rt.No. 459 ప్రకారం పునరుద్ధరణ ధరను చెల్లించిన తర్వాత ట్రేడ్ లైసెన్స్ ఆటోమేటిక్‌గా పునరుద్ధరించబడుతుందని తెలిపారు. అంతేకాదు ఈనెలలోగా రెన్యూవల్ చేసుకోవడంలో విఫలమైతే అదనంగా మరింత రుసుం చెల్లించాల్సి వస్తుందని వెల్లడించారు. లైసెన్స్ రుసుముతో పాటు, ట్రేడ్ లైసెన్స్ రుసుము రూ. 5000 వరకు ఉన్న ట్రేడ్‌లపై 10% మొత్తాన్ని వసూలు చేయనున్నట్లు చెప్పారు. మరోవైపు 5000 కంటే ఎక్కువ ట్రేడ్ లైసెన్స్ రుసుము ఉన్న ట్రేడ్‌లపై రూ. 1000 విధించబడుతుందన్నారు. అన్ని ట్రేడ్‌లకు తెలంగాణ గ్రీన్ ఫండ్‌గా ప్రతి కొత్త లైసెన్స్ లేదా ట్రేడ్ లైసెన్స్ పునరుద్ధరణ ఉంటుందని ప్రకటించారు.జూలై 27, 2017 నాటి రిజల్యూషన్ నెం.19 ప్రకారం లైసెన్సు లేకుండా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తిస్తే ఆ సమయంలో వ్యాపారికి 100% జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు. దీంతోపాటు 10% జరిమానా కూడా విధించబడుతుందని స్పష్టం చేశారు.

## బహిష్కరించటం కాంగ్రెస్‌కు అలవాటుగా మారింది

### – కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రామమందిరం ప్రారంభోత్సవాన్ని కాంగ్రెస్ బహిష్కరించడంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. బహిష్కరించటం కాంగ్రెస్ కు అలవాటుగా మారిందని వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. అయోధ్య ఆలయ ప్రారంభోత్సవానికి దూరంగా ఉండాలన్న కాంగ్రెస్ నిర్ణయం.. హిందువులను అవమానించటమే అని అన్నారు.హిందువుల జీవన విధానమం కాంగ్రెస్‌కు చులకన అని మండిపడ్డారు. పార్లమెంట్ సమావేశాలు, ఎన్నికల కమిషన్‌ను కాంగ్రెస్ బహిష్కరి స్తోందన్నారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న నాయకత్వం కాంగ్రెస్ ది అని విమర్శించారు. భారతదేశ సంస్కృతి, సంప్రదా లంటే కాంగ్రెస్‌కు గౌరవం లేదన్నారు. హిందుత్వ వ్యతిరేక ధోరణిని కాంగ్రెస్ మరోసారి బయటపెట్టుకుందన్నారు. అధికారమే పరమావధిగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరించటం దుర్మార్గమని కేంద్రమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజకీయ దృక్పథంతో కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుందని అన్నారు. ప్రణమ్ ముఖర్జీకి భారతరత్న ఇవ్వడాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించిందన్నారు. హిందువులకు సంబంధించిన ప్రతీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని విమర్శించారు. అయోధ్య కేసు విషయంలో కాంగ్రెస్ పార్టీ వితండవాదం చేసిందన్నారు. సనాతన ధర్మాన్ని క్యాన్సర్‌తో పోల్చి.. కాంగ్రెస్ పార్టీ దిగజారిపోయిందన్నారు. 1947లో సోమనాథ్ దేవాలయానికి వెళ్లొద్దని .. అప్పటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్‌కు నెహ్రూ లేఖ రాశారని గుర్తుచేశారు. అయోధ్య రామమందిరం జాతికి సంబంధించిన కార్యక్రమమని స్పష్టం చేశారు. రామాలయం ప్రారంభోత్సవానికి ఫాస్టర్లు, ముస్లిం మత పెద్దలు హాజరవుతున్నారని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

## తెలంగాణ నిరుద్యోగులకు గుడ్ న్యూస్

### – త్వరలో టీఎస్పీఎస్సీ బోర్డు చైర్మన్, సభ్యుల నియామకం

హైదరాబాద్, జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: అధికారంలోకి వచ్చాక ఎన్నికల వేళ ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి ఓకే చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ తర్వాత ఐదు గ్యారంటీల అమలుకు ముందడుగు వేసింది. ప్రజాపాలన - అభయహస్తం పేరుతో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది.

ఇప్పుడు తాజాగా తెలంగాణలో ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొంది. ఫిబ్రవరిలోనే ఉద్యోగాల నియామకాలు మొదలు పెడుతామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

దీంతో ఉద్యోగ నోటిఫికేషన్ కోసం లక్షలాది విద్యార్థులు ఎదురుచూస్తున్న పరిస్థితి. టీఎస్పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామా ఆమోదంతో ఉద్యోగాల నియామకాలకు అడ్డంకులు తొలగిపోయాయి. అతి త్వరలో టీఎస్పీఎస్సీ బోర్డు చైర్మన్, సభ్యులను సర్కార్ నియమించనుంది. చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ లేదా ఐపీఎస్ ఆఫీసర్‌ను నియమించే అవకాశం ఉంది.

### ప్రతీ ఏటా జాబ్ క్యాలెండర్?..

ఇటీవలే యూపీఎస్సీ చైర్మన్‌ను సీఎం రేవంత్ కలిసిన విషయం తెలిసిందే. పారదర్శకంగా బోర్డు ఉండేలా కసరత్తు చేపట్టారు. ప్రతీ సంవత్సరం జాబ్ క్యాలెండర్ ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. టీఎస్పీఎస్సీ బోర్డులో చైర్మన్‌తో పాటు 10 మంది సభ్యులు ఉండనున్నారు. బోర్డులో ఉండాల్సిన నిపుణుల కోసం ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. సీఎం విదేశీ పర్యటన తర్వాత కొత్త బోర్డు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. పారదర్శకంగా పరీక్షలు నిర్వహించడానికి ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది.

## ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన పనులను పూర్తి చేయాలి : ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్, జనవరి 11:సనత్ నగర్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. గురువారం అమీర్‌పేట్ డివిజన్‌లోని కుమ్మరిబస్తీలో ఆయన పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఎన్నికలకు ముందు కుమ్మరి బస్తీలో మంజూరైన మంచినీటి, డ్రైనేజీ నిర్మాణ పనులకు సంబంధించిన అంశాలను జలమండలి జీఎం హరిశంకర్, డీజీఎం వంశీకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. పనులు పూర్తయిన వెంటనే రోడ్డు నిర్మాణాలు చేపట్టాల్సి ఉందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో కోట్లాది నిధులు వెచ్చించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని వివరించారు.వీటిలో కొన్ని పూర్తి కాగా మరికొన్ని నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ ఇందిర, డీఈఈ మోహన్, స్ట్రీట్‌లైట్స్ డీఈ కిరణ్మయి, బీఆర్ఎస్ అధ్యక్షులు ఎం. హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి సంతోష్ మణికుమార్ పాల్గొన్నారు.

## 2035 నాటికి స్పేస్ స్టేషన్ నిర్మించాలి: ఇస్రో చీఫ్ సోమనాథ్

అహ్మదాబాద్: గుజరాత్‌లోని గాంధీనగర్‌లో అంతర్జాతీయ అంతరిక్ష సమావేశం జరుగుతోంది. ఆ సమావేశంలో ఇవాళ ఇస్రో చీఫ్(మోఖీూ అప్ట్రజీతితీఎజీని) ఎస్ సోమనాథ్ మాట్లాడారు. 2035లో అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించాలని, ఆ కేంద్రానికి భారతీయులు వెళ్లాలని, అక్కడ పరిశోధనలు జరగాలని ఆయన అన్నారు. తన ప్రసంగంలో ఆయన ప్రధాని మోదీని కొనియాడారు. అంతరిక్ష పరిశోధనలపై ప్రధాని మోదీ ఫోకస్ పెట్టారని, ఆయన సీఎంగా ఉన్న సమయంలోనూ ఆ విజన్ పనిచేశారన్నారు. అంతరిక్షంలో మానవుల నిరంతరం సంచారం ఉండాలని ప్రధాని పేర్కొన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. భారతీయ అంతరిక్ష సంస్థ గగన్‌యాన్ ప్రోగ్రామ్‌ను చేపడుతోందని, చంద్రుడిపై ఇండియన్‌ను దించడమే లక్ష్యమని, 2040 నాటికి చంద్రుడిపై భారతీయ వ్యోమగామి ఉంటాడని భావిస్తున్నట్లు ఇస్రో చీఫ్ వెల్లడించారు. నిజానికి ఆ లక్ష్యం చాలా దూరమే అయినా.. అది చాలా దగ్గరే అని, దీని కోసం మనం 2035లోగా స్పేస్ స్టేషన్‌ను నిర్మించాలని, అక్కడికి ఇండియన్స్ వెళ్లి పరిశోధనలు చేయాలని సోమనాథ్ తెలిపారు.

## కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్లో ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు

రాజన్న సిరిసిల్ల, జనవరి 11:(నేటినిజం ప్రతినిధి): కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్లో ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు

ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు హరిదాసు వేషాలు వేసి అందరినీ ఆకట్టుకున్నారు మన సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ విద్యార్థులు రంగురంగుల ముగ్గులను వేశారు సంక్రాంతి పండుగ యొక్క గొప్పతనాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు

ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసి రంగోలి ముగ్గుల పోటీలో పాల్గొన్నారు గెలిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ధరక్షన్ వసు పియా బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో కిడ్స్ కాన్వెంట్ స్కూల్ కరస్పాండెంట్ నరాల దేవేందర్,ప్రిన్సిపాల్ ధరక్షన్ వసు పియా, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

**నేటి కందం- నేటికి అందం**

ప్రీతి-వివేకానందుని
చేతములో దలచుకొనుచు చిన్మయవృత్తిన్
జాతీయ యువదినమ్మును
జాతికి చేతనము గలుగ జరిపింపవలెన్ ?

(జనవరి 12 జాతీయ యువ దినం)



-రాధశ్రీ
సెల్:9494481210

# డిజిటల్ నైపుణ్య యువతకు అపూర్వ ఉద్యోగావకాశాలు

## (12 జనవరి "జాతీయ యువజన దినోత్సవం" సందర్భంగా)

వివిధ డిజిటల్ అంతర్జాల మాధ్యమ వేదికల్లో సమాచారాన్ని టైప్ చేయడం, సమాచారాన్ని అన్వేషించడం, సమాచారాన్ని మూల్యాంకనం చేయడం, సమాచారాన్ని వితరణ చేయడం లాంటి ఆధునిక యుగపు పరిజ్ఞానం కలిగిన పౌరులను 'డిజిటల్ లిటరేట్స్'గా వర్గీకరిస్తారు. ప్రపంచవ్యాప్తంగా 15-24 ఏండ్ల లోపు యువతలో 71 శాతం ఇంటర్నెట్ వాడుతున్నారని, డిజిటల్ అసమానతలతో 346 మిలియన్ల యువత (పేద అభివృద్ధి చెందిన దేశాలు) ఇంటర్నెట్‌కు దూరంగా ఉన్నారని తేలింది. ఇండియాలో 38 శాతం కుటుంబాలు (61 శాతం పట్టణ, 25 శాతం గ్రామీణ) డిజిటన్ లిటరసీ కలిగి ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల ఇంటర్నెట్ లిటరసీ జాబితాలో భారత ర్యాంకు 73గా విశ్లేషించారు. డిజిటల్ టెక్నాలజీతో ఉత్పత్తి, కార్యదక్షత, వనరుల నిర్వహణ, పారదర్శకత, అత్యున్నత ఖచ్చితత్వం, సంతృప్తికర సేవలు, జవాబుదారీతనం, ఇన్నొవేషన్, వేగంగా మార్కెటింగ్, ఆదాయవృద్ధి, సమకాలీనత లాంటి అనేక అభివృద్ధి సాధన ప్రయోజనాలు ఉన్నాయి.

### 4వ పారిశ్రామిక 'సైబర్' విప్లవ యుగం:

ఆవిరి యంత్రాల రాకతో 1వ పారిశ్రామిక విప్లవం (1765), విద్యుత్/గ్యాస్/చమురు వనరుల వినియోగంతో 2వ పారిశ్రామిక విప్లవం(1870), ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్లు/న్యూక్లియర్ ఎనర్జీల రాకతో 3వ పారిశ్రామిక కంప్యూటర్ విప్లవాలను(1969) దాటుతూ నేడు డిజిటల్ యుగపు ఆధునిక రూపంగా 4వ పారిశ్రామిక సైబర్ విప్లవ (కృత్రిమ మేధ, ఆటోమేషన్, బయోటెక్నాలజీ, ఐఓటి, రోబోటిక్స్ లాంటి) ఫలాలను అనుభవిస్తున్న అత్యాధునిక సమాజంలో మానవాళి శాస్త్రసాంకేతిక సునామీలో మునిగి తేలుతున్నారు. కరోనా విజృంభనతో 5వ డిజిటల్ (సూపర్ స్మార్ట్ సొసైటీ, ఆరోగ్యరంగంలో కృత్రిమ మేధ వినియోగం) రిమోట్ కంట్రోల్ విప్లవం రానుందని అంచనా వేస్తున్నారు. 'డిజిటల్ యుగ పౌరులు'గా నేటి యువతీయువకులకు వృత్తి, ఉద్యోగ, ఉపాధి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా పలు రంగాల్లో అనంతమైన అవకాశాల నడుమ తీవ్ర సవాళ్ళు కూడా ఎదురవుతున్నాయి. కంప్యూటర్లతో ఇంటర్నెట్ అనుసంధాన మేలు కలయికతో కలియుగ తీరుతెన్నులు ఆసాంతం మారిపోయాయి.

### 1. డిజిటల్ యుగపు సవాళ్ళు:

అంతర్జాల అయోమయ, మాయాజాల, కృత్రిమ వలలో చిక్కిన నేటి యువత తీవ్రమైన బహుమితీయ సవాళ్ళను, ప్రమాదకర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తున్నది. డిజిటల్ యుగ యువత ఎదుర్కొంటున్న ముఖ్య సవాళ్ళలో సామాజిక(సోషియల్), భౌతిక(ఫిజికల్), మానసిక(సైకలాజికల్), నైతిక(మోరల్) అంశాలు అనేకం దాగి ఉన్నాయి.

### సామాజిక (సోషియల్) సవాళ్ళు:

చిరుప్రాయం నుంచే ఇంటర్నెట్ అద్భుత వలయంలో గంటల పాటు గడుపుతున్న డిజిటల్ కాలంలో ఏకాంతంలో కంప్యూటర్ గేమ్స్, సామాజిక మాద్యమాల్లో విహారాలతో మానవ సంబంధాలు బలహీణ పడడం, నేత్ర జబ్బులు, అశ్లీల పోస్టుల పరిచయాలు, లైంగిక దురాలోచనలు, అత్యాచారాలు, సైబర్ బుల్లీయింగ్, అక్రమ మానవ రవాణలు, విచిత్ర ప్రవర్తనలు, బాలలపై అత్యాచారాలు, సామాజం నుంచి వెలి వేసిన భావన, అభ్యంతరకర ప్రవర్తన, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడం, ఆత్మహత్య ధోరిణి, బాల కార్మికులు, వెట్టిచాకిరీ, చదువుపై ఏకాగ్రత లోపించడం, ఆటపాటలకు దూరం కావడం, వ్యక్తిత్వ వికాసం ఆగి/తరిగి పోవడం, కుటుంబ సంబంధాలు విచ్ఛిన్నం కావడం, సామాజిక ఘర్షనలు లాంటి అవలక్షణాలు కలుగుతాయి.

### శారీరక (ఫిజికల్) సవాళ్ళు:

గంటల తరబడి అంతర్జాలాన్ని పట్టుకొని సోఫాలు/కుర్చీలు/బెడ్స్‌కు వేలాడడం వల్ల శారీరక వ్యాయామాలు లోపించడంతో బాల్యంలోనే స్థూలకాయ సమస్యలు, ఫాస్ట్ ఫుడ్స్ పట్ల వ్యామోహం, కదలిక లేని నిశ్చల జీవనశైలితో నేటి బాలలు, మానసిక ఒత్తిడి, నేర ప్రవృత్తి, ఆన్‌లైన్ మోసాలు, ఆత్మన్యూనత భావన, వ్యక్తిగత సమాచారాన్ని దాచి పెట్టడం లాంటి పలు తీవ్రమైన శారీరక మానసిక సవాళ్ళను ఎదుర్కొంటున్నారు. డిజిటల్ ఉపకరణాల వలలో చిక్కి దృష్టి, కీళ్ళు, కండరాలు, వెన్నెముక, ఒత్తిడి, చర్మ, శ్వాస, మానసిక, నిద్రలేమి సమస్యలకు దారి తీస్తున్నాయి.

### మానసిక (సైకలాజికల్) సవాళ్ళు:

డిజిటల్ వలయ దుష్ప్రభావంతో పిల్లల్లో పలు మానసిక సమస్యలు కనిపిస్తాయి. అసాంఘీక ప్రవర్తనలు, లైంగిక వికృతాలోచనలు, కులమత వివక్షలు, వికృత క్రీడలు, మహిళల పట్ల విపరీత ధోరిణి, మానసిక విపరీతాలు లాంటి అనేక సమస్యలు యువత భవితకు అడ్డుగా నిలుస్తున్నాయి.

### నైతిక, మతపర (మోరల్, రిలిజియస్) సవాళ్ళు:

సాంస్కృతిక, నైతిక, మతపరమైన విపరీత ప్రవర్తనలతో పాటు ఛాందస వాదనలు, మత విద్వేషాలు, రెచ్చగొట్టే ఉపన్యాసాలు, భావ కాలుష్యాలు, జాతి వర్ణ వర్గ వివక్షలు, అసహనం, తీవ్రవాద ఆలోచనలు, ఉగ్రవాద భావనలు, అశాంతి, అస్థిర సమాజం లాంటి సమస్యలు పిల్లల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అశ్లీల మాధ్యమాలు అరచేతిలో అందుబాటులో ఉన్నందున ఆల్కహాల్, డ్రగ్స్, స్మోకింగ్ కన్న అతి ప్రమాదకరమైన దుష్పరిణామాలైన లైంగిక హింసలు, మహిళ వేధింపులు, అత్యాచార హత్యలు లాంటి అనైతిక సమస్యలు పెరుగుతున్నాయి. స్మార్ట ఫోన్ రూపంలో నీలి వీడియోలు అందుబాటులోకి రావడంతో బాలికల్లో 33 శాతం, బాలల్లో 13 శాతం లైంగిక హింసకు గురికావడం జరిగినట్లు తేలింది.

### డిజిటల్ యుగంలో అద్భుత అవకాశాలు:

విద్య, డిజిటల్ నైపుణ్యం, ఆశావహ దృక్పథం కలిగిన యువతకు డిజిటల్ ప్రపంచం రెడ్ కార్పెట్ వెల్‌కమ్ పలుకుతోంది. పుట్టుకతోనే ఇంటర్నెట్ అనుభవిస్తున్న పిల్లల్ని 'డిజిటల్ నేటివ్స్', ఇంటర్నెట్ వినియోగాన్ని నేర్చుకుంటున్న పెద్దల్ని 'డిజిటల్ ఇమ్మిగ్రాంట్స్'గా తరాలను వర్గీకరించాల్సి వస్తున్నది. డిజిటల్ ప్రపంచంలో విహరిస్తున్న నేటి బాలబాలికలు, యువతీయువకులు తీవ్రమైన సమస్యలతో సంసారం చేస్తూ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భావోద్వేగ రోగులుగా మిగిలి పోవడంతో ప్రపంచ మానవాళి భవిత ప్రశ్నార్థకం అవుతున్నది. డిజిటల్ విప్లవ సునామీతో యువతకు అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దారులు తెరుచుకున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్, పౌర సమాజం సమన్వయంతో కదిలితే విద్య, సాంకేతిక, ఆరోగ్య, ప్రజా సేవలు, న్యాయ వ్యవస్థ, ఆర్థిక, సమాచార సంభాషణా టెక్నాలజీ, ఈ-వ్యాపార వాణిజ్య రంగాల్లో అసంఖ్యాకమైన డిజిటల్ రంగ అవకాశాలు అందుతున్నాయి.

### డిజిటలైజేషన్ ప్రయోజనాలు:

డిజిటలైజేషన్ పుణ్యాన కరోనా విపత్తులో ఆన్‌లైన్ విద్య, సమావేశాలు, వ్యాపార సేవలు నిరాటంకంగా అందడం మనకు తెలుసు. డిజిటల్ వేదికలుగా విద్య, శిక్షణ, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు పలు రెట్లు పెరిగాయి. డిజిటలైజేషన్‌తో యువతలో శాస్త్రీయ అక్షరాస్యత, సృజనశీలత, విలక్షణ నవ్య ఆవిష్కరణలు, సంభాషనాచాతుర్యం, ఆకర్షనీయ ఉద్యోగాలు/వేతనాలు, విశ్వ కుగ్రామ భావనలు, క్రిటికల్ థింకింగ్, సమస్యల పరిష్కారం, జట్టు స్ఫూర్తి, విదేశీ భాషలు, ప్రజా సమస్యలకు తేలికైన సమాధానాలు, నేర్చుకోవాలనే తపన, సమాచార స్టోరేజ్, ఆటోమేషన్, ఎడిటింగ్, సామాజిక అనుసంధానం, పని తీరులో మార్పులు, డాటా ఎంట్రీ, సామాజిక మాద్యమాల విప్లవం, క్షణాల్లో ఆలోచనల వినిమయం, గ్రీన్ వ్యవస్థలతో పర్యావరణ పరిరక్షణ, ఆన్‌లైన్ వస్తు విక్రయాలు, సామాజిక స్పృహ లాంటి ఆధునిక పరిజ్ఞానాలు పెరుగుతున్నాయి. అరచేతిలో స్మార్ట్‌ఫోన్‌తో ఏ సమస్యకైన క్షణాల్లో సరైన సమాధానం ఇవ్వగలిగిన గూగులమ్మ రాకతో మానవ జీవనశైలి పూర్తిగా మారి పోయింది.

ఆధునిక యువత మారుతున్న శాస్త్రసాంకేతికతలను ఆకలింపు చేసుకొని, క్రమం తప్పకుండా శాస్త్రసాంకేతికతలను ఒంటపట్టించుకొని, డిజిటల్ యుగంతో నిత్యం 'అప్‌డేట్' కావడానికి కృషి చేయని యెడల వెంటనే 'అవుట్‌డ్ట్' కావలసిన అగత్యం ఏర్పడుతుందని



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

## -జిల్లా కలెక్టర్ వల్లురూ క్రాంతి.



సంగారెడ్డి, జనవరి 11: (నేటినిజం ప్రతినిధి):ప్రభుత్వ భూములు,చెరువులు నీటి వనరుల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లురూ క్రాంతి అధికారులను ఆదేశించారు.

బుధవారం కలెక్టరెట్ లోని తన చాంబర్లో అదనపు కలెక్టర్లతో కలిసి రెవెన్యూ,నీటిపారుదల, అటవీ, మత్స్య, వ్యవసాయ, హెచ్ఎండిఏ,షుగర్ కేన్,తదితర శాఖల అధికారులతో జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన పలు సమస్యలకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా అధికారులతో ఆయా సమస్యలపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ భూములు, చెరువులు,కుంటలు,నీటి వనరులు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని, కబ్జాలు, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లాలోని అన్ని ప్రభుత్వ హాస్టల్స్ కు ఒక్కో హాస్టల్ కు ఒక్కో జిల్లా అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించాలని, విద్యార్థులకు ఎలాంటి సైకాలజికల్ ప్రాబ్లమ్స్ ఉన్నా పరిష్కరించేలా, వారి చదువు విషయంలోనూ శ్రద్ధ తీసుకొని పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని,అదే విధంగా టీచర్ల తో కౌన్సిలింగ్ మెకానిజం ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ కు సూచించారు.

జహీరాబాద్ ట్రైడెంట్ చక్కెర కర్మాగారం రైతులకు చెల్లించాల్సిన బకాయిలు, తీసుకున్న చర్యలపై సంబంధిత అసిస్టెంట్ కమిషనర్ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తదుపరి చేపట్టాల్సిన చర్యలపై సూచించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ, ఆర్డీవోలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పశువైద్య ,పశు సంవర్ధక శాఖలో రీఆర్గనైజేషన్ చేయాలి

## -స్పీకర్ ను కోరిన పశువైద్య, పశు సంవర్ధక శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్



హైదరాబాద్ జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పశు వైద్య, పశు సంవర్ధక శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ సభ్యులు డా .కే.రామారావు , డాక్టర్ నాగయ్య అధ్యక్షులు మరియు డాక్టర్ భాను నాయక్ ప్రధాన కార్యదర్శి గార్ల ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ను కలసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పశువైద్య ,పశు సంవర్ధక శాఖ లో రీఆర్గనైజేషన్ చేయాలని ఉ.ూ.ఓ.ూ.జీ.317 లో ఇబ్బందులు పడుతున్న వారి సమస్యల మీద విజ్ఞప్తి చేసారూ. ఇందుకు తెలంగాణ శాసన సభాధిపతి సానుకూలంగా స్పందించినట్లు వారు తిలిపారు.అలాగే శాఖకు సంబంధించిన అనేక విషయాల మీద చర్చించడం జరిగిందాని తెలిపారు.. ఈ కార్యక్రమంలో డా.సిహెచ్.నరసింహరావు, డా.డి.శాంతిబాబు, డా బి.రమేష్, డా ఎం.రఘు కిషోర్ మరియుడా ఎన్.నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# "మాకు మెజారిటీ ఉంది" మాదే నిజమైన శివసేన..

## – ధీమా వ్యక్తం చేసిన సిఎం ఏక్‌నాథ్ షిండే

ముంబై జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: శివసేన ఉద్ధవ్ థాకరే శివసేన షిండే వర్గాలు దాఖలు చేసిన అనర్హత పిటిషన్ల పై మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్ కీలకమైన తీర్పును ప్రకటించనున్న నేపథ్యంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే బుధవారంనాడు కీలక వ్యాఖ్యలు చేశారు."మాకు మెజారిటీ ఉంది" అని ధీమా వ్యక్తం చేశారు.

### మాదే నిజమైన శివసేన..

"నేను చెప్పదలచుకున్నది ఒకటే. మాకు మెజారిటీ ఉంది. విధాన సభలో 67 శాతం, లోక్‌సభలో 75 శాతం మెజారిటీ ఉంది. మాకు 13 మంది ఎంపీలు, 50 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. మాకున్న మెజారిటీ కారణంగానే మమ్మల్ని నిజమైన శివసేనగా ఎన్నికల కమిషన్ గుర్తించింది. ధనస్సు-బాణం గుర్తు కేటాయించింది. మెరిట్ ఆధారంగా మమ్మల్ని స్పీకర్ పాస్ చేస్తారనే ఆశాభావంతో ఉన్నాం" అని ఏక్‌నాథ్ షిండే మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.గత ఏడాది శివసేన ఉద్ధవ్ వర్గంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన షిండే, ఆయన వర్గం ఎమ్మెల్యేలు బీజేపీకి మద్దతు ప్రకటించడంతో ఉద్ధవ్ సారథ్యంలోని మహా వికాస్ అఘాడి ప్రభుత్వం మహారాష్ట్రలో కుప్పకూలింది. షిండే ముఖ్యమంత్రిగా బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. షిండే సహా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని థాకరే వర్గం స్పీకర్‌కు ఫిర్యాదు చేయగా, తమదే నిజమైన శివసేన అంటూ థాకరే వర్గంపై వేటు వేయాలని షిండే వర్గం సైతం స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. ఉభయ వర్గాలు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో స్పీకర్ నిర్ణయంపై అత్యున్నత న్యాయస్థానం జనవరి 10వ తేదీని తుది గడువుగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో తీర్పుకు మూడు రోజుల ముందే స్పీకర్ ముఖ్యమంత్రి షిండేను కలవడంపై ఉద్ధవ్ వర్గం సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేసింది. అయితే తన చర్యను నార్వేకర్ సమర్ధించుకున్నారు. స్పీకర్ ఏ ఉద్దేశంతో ముఖ్యమంత్రిని కలుస్తారో థాకరేకు తెలియదా అని నిలదీశారు. ఇప్పటికీ ఆయన (ఉద్ధవ్) ఆరోపణలు చేస్తున్నారంటే ఆయన ఉద్దేశమేమిటో చాలా స్పష్టంగా తెలుస్తోందన్నారు. అనర్హత పిటిషన్లపై విచారణ జరుపుతున్నప్పుడు స్పీకర్ ఇతర పనులు చేయకూడదనే రూలు ఏమీ లేదన్నారు.

# రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్టకు హాజరుకాబోమని స్పష్టం చేసిన కాంగ్రెస్ పార్టీ

న్యూఢిల్లీ జనవరి 11(ఎక్స్ ప్రెస్ న్యూ న్);: అయోధ్య రామజన్మభూమిలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ట కోసం హిందువులు ఆత్మతతో ఎదురు చూస్తున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని ప్రముఖులకు రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు స్వయంగా ఆహ్వానించారు. హాజరుకాబోమని కాంగ్రెస్ పార్టీ స్పష్టంచేసింది. ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం బీజేపీ ఆర్ఎస్ఎస్ ఈవెంట్ అని హాట్ కామెంట్స్ చేసింది.ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనాలని గత నెలలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్ సోనియా గాంధీ లోక్ సభలో కాంగ్రెస్ పక్ష నేత అదిర్ రంజన్ చౌదరికి ట్రస్ట్ సభ్యులు స్వయంగా ఆహ్వానించారు. శ్రీరాముడిని లక్షలాది మంది పూజిస్తారని కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు చెబుతున్నారు. మతం అనేది వ్యక్తిగత అంశమని వారు అభిప్రాయపడ్డారు. గత కొన్నిరోజులుగా బీజేపీ, ఆరెస్సెస్ ఆ ఘటనను రాజకీయ అంశంగా మలిచాయని విమర్శించారు.అయోధ్యలో రామాలయ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. లోక్ సభ ఎన్నికలు దగ్గరపడటంతో ప్రారంభించడానికి బీజేపీ నేతలు ఆసక్తి చూపిస్తున్నారని విమర్శించారు. ఇది ముమ్మాటికీ ఎన్నికల మైలేజ్ కోసం చేపట్టిన స్టంట్‌గా అభివర్ణించారు.

# ఇండియా కూటమి ఉమ్మడి మేనిఫెస్టోపై స్పష్టత..

న్యూఢిల్లీ జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఈ ఏడాది ఏప్రిల్- మేలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా (ఎ.ఐ.ఆ.ఎ.ం.) బ్లాక్ ఉమ్మడి మేనిఫెస్టో తో ప్రజల ముందుకు వెళ్తుందా? అనే ప్రశ్నకు 'లేదనే' మాట వినిపిస్తోంది. కూటమిలోని భాగస్వామ్య పార్టీలకు సొంత మేనిఫెస్టోలు ఉంటాయని, అయితే ఉమ్మడి ఎజెండా మాత్రం ఉంటుందని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల పంపకాలకు సంబంధించిన చర్చలు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. అయితే, చర్చలు ఇంకా కొలిక్కి రావాల్సి ఉన్నాయి.సీట్ల షేరింగ్‌పై చర్చల్లో భాగంగా మంగళవారంనాడు న్యూఢిల్లీలోని ముకుల్ వాస్నిక్ నివాసంలో మహారాష్ట్రకు చెందిన 'మహా వికాస్ కూటమి' భాగస్వాముల మధ్య చర్చలు జరిగాయి. చర్చలు ఫలప్రదంగా జరిగినట్టు సమావేశా నంతరం నేతలు తెలిపారు. సీట్ల షేరింగ్ కుదుర్చుకున్న తొలి రాష్ట్రం మహారాష్ట్రేనని నేతలు ప్రకటించారు. అయితే, మహా వికాస్ కూటమిలోని శివసేన (యూబీటీ), ఎన్‌సీపీ, కాంగ్రెస్ మధ్య ఏ రేషియోలో సీట్ల పంపకాలకు అవగాహన కుదిరిందనేది అధికారికంగా నేతలు ఇంకా ప్రకటించలేదు. ఉద్ధవ్ థాకరే సారథ్యంలని శివసేన పెద్దన్న పాత్ర పోషించనుందని, ఎన్‌సీపీ, కాంగ్రెస్ కంటే ఎక్కువ సీట్లలో పోటీ చేయనుందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఇండియా కూటమిలో కీలక పార్టీగా ఉన్న కాంగ్రెస్ మాత్రం విజయమే లక్ష్యంగా భాగస్వామ్య పార్టీలతో చర్చలు సాగిస్తోంది. ఎన్ని ఎక్కువ సీట్లలో పోటీ చేశామనే ధోరణిలో కాకుండా అత్యధిక సీట్లలో గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ అధిష్ఠానం వ్యూహారచన సాగిస్తోంది.

# వీరోచితయోధుడు వడ్డే ఓబన్న ఆశయాలను కొనసాగిద్దాం-డీఆర్ఓ నగేష్

సంగారెడ్డి, జనవరి 11: (నేటినిజం ప్రతినిధి):వీరోచిత యోధుడు, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత వడ్డే ఓబన్న ఆశయాలను కొనసాగిస్తూ, వారి స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని జిల్లా రెవెన్యూ అధికారి నగేష్ పేర్కొన్నారు.

గురువారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో వడ్డే ఓబన్న జయంతోత్సవాన్ని అధికారికంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి డి ఆర్ ఓ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వల చేసి, వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులస్తులను, గతంలో మరుగునపడిన చరిత్రకారులను గుర్తించేలా వారిని స్మరించుకునేలా జయంతులను నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రతి వర్గంలో ఉన్న వీరుల చరిత్రను వెలికి తీసి, వారికి సముచిత గౌరవాన్ని ఇస్తున్నదని, అందులో భాగంగా నేడు వడ్డే ఓబన్న జయంతిని నిర్వహించుకుంటున్నామని అన్నారు. వారి వీరోచిత పోరాట స్ఫూర్తి భావితరాలకు తెలియాలని అన్నారు.వడ్డెర సంగం



జిల్లా అధ్యక్షులు లింగయ్య మాట్లాడుతూ వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా స్థాయిలో వడ్డెర కుల సంఘానికి భవనం కావాలని, వడ్డెర కుల విద్యార్థులు చదువుకోవడానికి కుల ధ్రువీకరణ పత్రాల కోసం ఇబ్బందులు పడుతున్నారని, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డి ఆర్ ఓ ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి జగదీష్, టీజీవో జిల్లా అధ్యక్షులు వైద్యనాథ్, డైరెక్టర్ కుల సంఘం జిల్లా అధ్యక్షులు లింగయ్య, దుర్గాప్రసాద్, గిరిజన సంక్షేమ అధికారి ఫింగి, జిల్లా అధికారులు, వడ్డెర కుల వెనుకబడిన తరగతుల సంక్షేమ బాంధవులు, తదితరులు పాల్గొన్నారు.

# స్పష్టమైన ఓటరు జాబితాను రూపొందించాలి

## -18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి.

## -డూప్లికేట్ ఓటర్ల పై దృష్టి సారించాలి .

## -జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి .

సంగారెడ్డి, జనవరి 11: (నేటినిజం ప్రతినిధి):ఓటరు జాబితా సవరణ కార్యక్రమం -2024లో భాగంగా స్పష్టమైన తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులకు ఆదేశించారు.

బుధవారం కలెక్టరేట్ లోని తన చాంబర్లో అదనపు కలెక్టర్లతో కలిసి ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ లతో ఓటర్ జాబితా రూపకల్పన పై సమీక్ష సమావేశం నిర్వహించారు.

నియోజకవర్గం వారీగా వచ్చిన ఆయా ఫారాలు, డిస్పోజ్ చేసినవి తదితరాల ను సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22 వరకు క్లేమ్స్, ఆబ్జెక్షన్స్ స్వీకరించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేయించాలన్నారు. అర్హులందరూ ఓటరు తుది జాబితాలో ఉండాలని, ఎవరూ తప్పిపోరాదని తెలిపారు. ముఖ్యంగా ఫారం-7 ,ఫారం - 8 ల పరిశీలన పూర్తి చేసి ఆన్లైన్ పూర్తి కావాలని ఆవె సూచించారు. ఈఆర్వోలు డూప్లికేట్ ఓటర్ల పై దృష్టి సారించాలని, ఫారం ప్రాసెస్ ప్రధానమైనదని, ఎలాంటి పొరపాట్లు జరగకూడదని, ఎటువంటి ఫిర్యాదులు రాకూడదని స్పష్టం చేశారు.

25 సంవత్సరాలు పైబడిన వారు ఫారం 6 ద్వారా నమోదైనప్పుడు, గతంలో వారు ఓటరుగా నమోద య్యారా లేదా అన్నది క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు.

ఫారం - 6 ఓటర్ నమోదు, ఫారం - 7 ద్వారా ఓటరుజాబితా నుండి తొలగింపు, ఫారం -8 ద్వారా మార్పులు, చేర్పులు జరగాలని, ఆయా ఫారాలు పరిష్కరించినవి సరి చూసుకోవాలని, తొలగించిన ఓటర్లకు సంబంధించి సరైన రుజువులు ఉండాలన్నారు.అన్నింటిని నిబంధనలు పాటిస్తూ చేయాలని సూచించారు. వంద సంవత్సరాలకు పైబడి వయస్సు గల వారి తాజా జాబితా తెప్పించుకోవాలన్నారు.ఈ ఆర్ ఓ లు ఆయా కార్యక్రమా లపై దృష్టి పెట్టి రోజు పర్యవేక్షించా లన్నారు.

క్షేత్రస్థాయిలో బి ఎల్ ఓ లను ఆక్టివేట్ చేయాలన్నారు.బి ఎల్ ఓ లు,బి ఎల్ ఓ సూపర్వైజర్ల తో సమావేశాలు నిర్వహించాలన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అన్ని వివరాలు అందించాలని తెలిపారు. ఓటర్ జాబితా నుండి తొలగించే వారి వివరాలను పునః పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నోటీసులు జారీ చేసి తొలగింపుకు బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఓటు నమోదు, ఓటు హక్కు వినియోగించు కోవడం పై స్వీప్ కార్యక్ర మాలను విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. ఒక కుటుంబంలోని వ్యక్తులందరికీ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటు హక్కుఉండేలా చూడాలన్నారు.ఈనెల 20, 21 తేదీలలో జిల్లా లోని అన్ని పోలింగ్ కేంద్రాలలో స్పెషల్ క్యాంపెయిన్ డేస్ నిర్వహించడం జరుగుతుందని ఆయా పోలింగ్ కేంద్రాలలో బి ఎల్ ఓ లు అందుబాటులో ఉంటారని తెలిపారు.అట్టి విషయాన్ని విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డి ఆర్ ఓ నగేష్, ఐదు నియోజక వర్గాలఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ లు, ఎన్నికల విభాగపు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌తో సహా మరో నలుగురు సభ్యుల రాజీనామాకు గవర్నర్ ఆమోదం

హైదరాబాద్ జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్ధన్ రెడ్డి సహా మరో నలుగురు సభ్యుల రాజీనామాను గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ఆమోదించారు. గతేడాది డిసెంబర్ లో టీఎస్‌పీఎస్ చైర్మన్ బి.జనార్ధన్‌రెడ్డి రాజీనామా చేశారు. చైర్మన్, సభ్యుల రాజీనామాలు చేసి నెల రోజులు గడుస్తున్నా.. గవర్నర్ వాటిని ఇంత వరకు ఆమోదించడం లేదంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి గవర్నర్ కు లేఖ రాశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ లేకపోవడంతో ఉద్యోగాల భర్తీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నామని లేఖలో పేర్కొన్నారు. దీంతో వారి రాజీనామాలకు గవర్నర్ ఆమోదం తెలిపారు.టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్?1 సహా పలు ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు, గ్రూప్ - 2 వాయిదాలు వంటి నిర్ణయాలతో నిరుద్యోగుల్లో అసంతృప్తి నెలకొంది. పోలీసు కేసులు, వివాదాలతో టీఎస్‌పీఎస్సీ ప్రతిష్ఠ దిగజారిపోయింది. రాజీనామా చేయాలన్న డిమాండ్లతో చైర్మన్ సహా ఇతర సభ్యులు రాజీనామా చేశారు. అయితే గవర్నర్ వాటిని ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టారు. దీంతో ఉద్యోగాల భర్తీకి ఆటంకం ఏర్పడింది. తాజా నిర్ణయంతో ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ లభించినట్లైంది.

# టీపీసీసీ చీఫ్ పోస్ట్ కోసం సీనియర్ నేతలు లాబీయింగ్

హైదరాబాద్ జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టి నెలరోజులు గడిచాయి. పాలనపరంగా అన్ని విభాగాలపై క్రమంగా పట్టు సాధిస్తున్నారు. సీఎం పదవీతోపాటు టీ పీసీసీ చీఫ్గా రేవంత్ రెడ్డి ఉన్నారు. 2, 3 నెలల్లో లోక్ సభ ఎన్నికలు జరగనున్నాయి. ఆ లోపు టీ పీసీసీ చీఫ్ను నియమించాలని కాంగ్రెస్ హైకమాండ్ భావిస్తుందని విశ్వసనీయ సమాచారం. టీపీసీసీ చీఫ్ పోస్ట్ కోసం సీనియర్ నేతలు లాబీయింగ్ చేస్తున్నారు.

రేసు లో జగ్గారెడ్డి, జీవన్ రెడ్డి.. వివేక్, రాజగోపాల్ రెడ్డి

టీ పీసీసీ చీఫ్ పోస్ట్ రేసులో ముందు వరసలో ఫైర్ బ్రాండ్ జగ్గారెడ్డి ఉన్నారు. ప్రస్తుతం ఆయన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవీలో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్ సీటు సంగారెడ్డి నుంచి ఓడిపోయారు. లేదంటే మంత్రి పదవీ వరించేదని అతని సన్నిహితులు చెబుతుంటారు. పీసీసీ అధ్యక్ష పదవీ కోసం జగ్గారెడ్డి ఢిల్లీ వెళ్లి లాబీయింగ్ చేస్తున్నారు. అధ్యక్ష పదవీ కావాలని అడుగుతున్నారు. పదవీ ఇచ్చేందుకు వెనకాడితే తనకు ఎమ్మెల్సీ పదవీ ఇవ్వాలని జగ్గారెడ్డి అడిగే అవకాశం ఉంది. ఎమ్మెల్సీ అయిన తర్వాత మంత్రి అవడం ఈజీ అనే సంగతి తెలిసిందే. రేవంత్ ప్రభుత్వంలో మరో ఏడు మంత్రి పదవులకు ఛాన్స్ ఉంది. అందులో ఒక పోస్ట్పై జగ్గారెడ్డి కన్నేసినట్టు తెలుస్తోంది. మెదక్ లోక్ సభ నుంచి కూతురు జయారెడ్డి లేదంటే సతీమణి నిర్మలకు సీటు ఇవ్వాలని కోరుతున్నారని తెలిసింది.

జగ్గారెడ్డి తర్వాత రేసులో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఉంటారు. జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోవడంతో మంత్రి పదవీ మిస్సయ్యింది. తప్పకుండా బెర్త్ దక్కేదని విశ్లేషకులు చెబుతున్నారు. ఎమ్మెల్సీగా ఉన్నప్పటికీ మంత్రిగా సీఎం రేవంత్ అవకాశం ఇవ్వలేదు. మంత్రివర్గ విస్తరణలో తీసుకుంటారనే గ్యారంటీ లేదు. టీ పీసీసీ చీఫ్ పదవీ వైపు జీవన్ రెడ్డి చూస్తున్నారు. వీరిద్దరితోపాటు గడ్డం వివేకానంద కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్లు కూడా టీ పీసీసీ చీఫ్ పోస్ట్ కోసం వినిపిస్తున్నాయి. వీరిలో ఎవరికీ పదవీ దక్కుతుందో చూడాలి మరి.

# తెలుగుదేశం పార్టీకి ఎంపీ కేశినేని నాని రాజీనామా

## -సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరుతా

విజయవాడ, జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసిన విజయవాడ ఎంపీ కేశినేని నాని.. వైఎస్ఆర్సీపీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. ఎంపీగా రాజీనామా చేశానని, ఆ రాజీనామాకు ఆమోదం లభించగానే.. సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరుతానని ప్రకటించారు. ఇదే విషయమై బుధవారం నాడు మీడియా ముందుకు వచ్చిన కీలక వ్యాఖ్యలు చేశారు. మీడియా సమావేశంలో చంద్రబాబుపై తీవ్ర ఆరోపణలు చేశారు. చంద్రబాబు పచ్చి మోసగాడు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలుగు దేశం పార్టీలో చాలా అవమానాలు భరించానని, ఇక భరించలేకనే ఆ పార్టీని వీడుతున్నట్లు తెలిపారు కేశినేని నాని.

**చంద్రబాబు, లోకేష్పై తీవ్ర ఆరోపణలు..**

తాను టీడీపీలో చేరినప్పటి నుంచి పార్టీ గెలువు కోసం ఎంతో శ్రమించానని అన్నారు కేశినేని నాని. పార్టీ కోసం దాదాపు రూ. 2 వేల కోట్ల మేర వ్యాపారాలను బంద్ చేయాల్సి వచ్చిందన్నారు. కానీ, చంద్రబాబు తనను అనేక రకాలుగా అవమానించారని ఆరోపించారు. పార్టీకి అన్ని రకాలుగా అండగా ఉన్న తనను.. కనీసం లెక్క చేయలేదన్నారు. చాలా అవమానాలు భరించానని, ఇక భరించలేకనే ఆ పార్టీని వీడుతున్నట్లు ఎంపీ కేశినేని నాని తెలిపారు.'2013 జనవరి 16 నుండి విజయవాడ పార్లమెంట్ ఇన్చార్జ్ అభ్యర్థిగా కష్టపడుతూ వచ్చాను. చంద్రబాబు 'మీకోసం' పాదయాత్రలో నన్ను ఇన్చార్జిగా చేశారు. ఆరోజు నుండి ఈ రోజు వరకూ పార్టీ కోసం పనిచేశాను. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో జరిగిన పంచాయితీ, జెడ్పీటీసీ, ఎంపిటీసీ, కార్పోరేషన్, జనరల్ ఎలక్షన్లు అన్నింటినీ నేనే హ్యాండిల్ చేశాను. నా సొంత వ్యాపార సంస్థ కన్నా తెలుగుదేశం పార్టీ ముఖ్యం అని ఆ పనులు అన్నీ చేశాను. అంతకు ముందు బైఎలక్షన్లలో కాంగ్రెస్ నుండి వచ్చి వైసిపి తరపున బారీ మెజార్టీతో గెలిచారు. మా సొంత సామాజిక వర్గానికి చెందిన పలువురు ప్రముఖులు చంద్రబాబును నమ్మి డబ్బులు ఎందుకు పాడుచేసుకుంటున్నావు హెచ్చరించారు. అయినా పట్టించుకోలేదు. ఆయన గెలుపు కోసమే కృషి చేశాను. పార్టీ కోసమే పని చేశాను. కార్పోరేషన్, జెడ్పీటీసీ, ఎంపిటీసీ, జనరల్ ఎలక్షన్లో గెలిచాం. అప్పుడు ఖర్చు పెట్టన ప్రతి రూపాయి నాదే. గతంలో కూడా నాకు సీటు ఇవ్వనంటే ప్రజలు డిమాండు చేయడంతో ఇచ్చారు. ఎంపిగా అక్రమ సంపాదనకోసం ఆశపడలేదు, వ్యాపారం వదులుకున్నా. పార్టీ కోసం నేను హైదరాబాద్లో అమ్ముకున్న ఆస్తుల విలువ నేడు రూ. 2000 కోట్లు ఉంటుంది.' అని అన్నారు నాని.

'లోకేష్ మంగళగిరిలో ఓడిపోతే నేను ఎంపిగా గెలిచాను. పార్టీలో అనేక రకాలుగా నన్ను అవమాన పరిచారు. నేను ఢిల్లీలో ఉన్నాను కార్పోరేషన్ ఎలక్షన్లు ఏం చేస్తున్నావు అని చంద్రబాబు ఫోన్ చేసి అడిగారు. మేయర్ అభ్యర్థి ఎవరిని పెడుతున్నారని అన్నారు. నాకు తెలియదని బదులిచ్చాను. బోండా ఉమ భార్యను పెడుతున్నారా అయితే ప్రమాదం.. మీ అమ్మాయిని పెట్టండి అని చంద్రబాబు సూచించారు. చంద్రబాబు చెప్పారు.. పార్టీ కోసం చెయ్యాలి అని తన కూతురు శ్వేతను బలవంతంగా ఒప్పించాను. కార్పోరేషన్లు ఎన్నికలకు రెండు రోజులు ముందు కేశినేని నానిని చెప్పుతో కొడతాను అని ఒక నాయకుడు అన్నాడు. అయినప్పటికీ పార్టీనుండి ఎవ్వరూ స్పందనలేదు. వాళ్ల ప్రెస్ మీట్ వల్ల పార్టీ చెల్లా చెదురు అయిపోయింది. సిట్టింగ్ ఎంపిని అయిన నేను లేకుండానే కార్పోరేషన్ ఎన్నికల్లో ప్రచారానికి చంద్రబాబు వచ్చారు. పార్టీ అధ్యక్షుడు పార్టీ ఎంపీని ప్రోటోకాల్కు విరుద్ధంగా ప్రచారానికి రావద్దన్నారు. అయినా బరించా. వారికి ఇష్టం లేకపోతే తప్పుకుంటాను అని కూడా చెప్పాను. అందుకు అంగీకరించకపోగా.. ఎంపీగా నువ్వే ఉండాలని చంద్రబాబు అందరి ముందే అన్నారు.' అని గుర్తు చేశారు కేశినేని నాని.

'ఇప్పుడు నా కుటుంబ సభ్యులకు ఎంపీ సీట్లు కావాలనుకుంటున్నారు. అందులో తప్పులేదు. కానీ, టీడీపీలో 6 ఎంపి సీట్లు కమ్మ వర్గం వారే పోటీ చేస్తారు. అక్కడ ఇవ్వచ్చుగా. నాకు తెలియకుండా ఇక్కడ ఎలా హామీ ఇస్తారు. ఆలపాటి రాజా, నెట్టెం రఘురాం, కొనకళ్ళ నారాయణను నా దగ్గరకు పంపారు. తిరువూరు సభ విషయంలో నాని ఎందుకు కల్పించుకున్నారని లోకేష్ అడిగారని వారు చెప్పారు. ఆ రోజు రౌడీ మూకలతో కలిసి నన్ను కొట్టించాలని అనుకున్నారు. తొమ్మిదిన్నర ఏళ్ళలో పార్టీకి నేను చేసిన ద్రోహం ఏంటి? మీరు జైల్లో ఉంటే మీకు, మీ కుటుంబానికి నేను అండగా నిలబడలేదా? చంద్రబాబు మోసగాడు అని ప్రపంచానికి తెలుసు. కానీ, ఇంత మోసగాడని ఇప్పుడే తెలిసింది.' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు నాని.

**స్పీకర్కు రాజీనామా లేఖ..**

'నా ఎంపీ పదవికి రాజీనామా లేఖను మెయిల్ ద్వారా లోక్సభ స్పీకర్కు పంపుతాను. రాజీనామాకు ఆమోదం లభించిన వెంటనే వైసీపీలో చేరుతాను. విజయవాడకు సీఎం వచ్చిన ప్రతిసారి నేను అటెండ్ అవ్వాల్సి ఉంటుంది. అయితే, పార్టీ ఆదేశం మేరకు వెళ్లలేదు. జగన్ పేదల పక్షపాతి, నిరుపేదల పక్షపాతి, అభివృద్ధి లేకపోవడానికి కారణం కోవిడ్. జగన్ నాకు బాగా నచ్చాడు.. నా రాజీనామా అమోదించగానే పార్టీలో చేరుతా.' అని స్పష్టం చేశారు కేశినేని నాని.

**విజయవాడ అంటే పిచ్చి..**

'విజయవాడ అంటే నాకు పిచ్చి ప్రేమ. నేను ఎప్పుడూ చంద్రబాబును టికెట్ అడగలేదు. విమానాశ్రయం కూడా నాగార్జున యూనివర్సిటీ దగ్గర కట్టాలనుకున్నారు. ఎయిర్పోర్టు విషయంలో వెంకయ్యనాయుడు నన్ను సపోర్ట్ చేశారు. విజయవాడ కోసం నాటి చంద్రబాబు ప్రభుత్వం కనీసం రూ. 100 కోట్లు కూడా ఇవ్వలేదు. విజయవాడకు వచ్చిన అభివృద్ధి పనులున్నీ కేంద్రం నుంచి నేను తీసుకువచ్చాను. విజయవాడ ఓ నిజం అమరావతి ఓ కల. దాన్ని నిజం చేయడానికి సమయం పడుతుంది అని చెపుతున్నా. చెన్నై, కోల్ కత్తా, హైదరాబాద్, బెంగుళూరు, ముంబాయిని వదిలి అమరావతికి ఎందుకు వస్తారు అని చెప్పాను.' అని అన్నారు కేశినేని నాని.

# అసెంబ్లీకీ లేటే, మీటింగ్కు లేటేనా!

## -మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ కు కేటీఆర్ చురకలు

వరంగల్ జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ సమీక్ష సమావేశం 8వ రోజు తిరిగి ప్రారంభమైంది. వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఉన్న 7 అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీటీసీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, కడియం శ్రీహరి,పోచారం శ్రీనివాస రెడ్డి, మధుసుధనా చారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, పొన్నాల లక్ష్మయ్య, రావుల చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు.సమావేశానికి లేటుగా మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ వచ్చారు. ఈ క్రమంలోనే వినయ్ భాస్కర్కు కేటీఆర్ చురకలు అంటించారు. అసెంబ్లీకీ లేటే, మీటింగ్కు లేటేనా అని ప్రశ్నించారు.ఇక ఈ సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. "రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ సమావేశాలు నిర్వహిస్తున్నాము. తల్లడిల్లి ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని 10 ఏళ్ల పాటు చల్లగా కాపాడుకున్నాం. కొన్ని తప్పిదాల వల్ల ఈ ఎన్నికల్లో మనం ఓటమి పాలయ్యాం. ఇప్పుడు ఢిల్లీ చేతుల్లోకి తెలంగాణ వెళ్ళింది. మన తెలంగాణ మన చేతుల్లోకి తెచ్చుకునే సమయం ఆసన్నమైంది. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోండి. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. తెలంగాణ గళం, బలం ఢిల్లీలో వినిపించాలంటే మనం రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలవాల్సిన అవసరం ఉంది" అని పేర్కొన్నారు.

# మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దోమతెరలు పంపిణీ



హైదరాబాద్ జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : కుష్టు వ్యాధి గ్రస్తులకు మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ ఆధ్వర్యం లో బోరబండ లెప్రసీ కాలనీ యందు గల లెప్రసీ వ్యాధిగ్రస్తులకు దోమతెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా. మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ లిల్లీ మేరి మాట్లాడుతూ ఒక వైద్య పరమైన సమస్య మాత్రమే కాకుండా ఇదో సామాజిక సమస్య అని రోగి నుండి పీల్చే గాలి ద్వారా, స్పర్శ ద్వారా, సానిహిత్యం ద్వారా ఈ వ్యాధి ఇతరులకు వ్యాపిస్తుందని , ఇది ఒక అంటువ్యాధి అని, బహుళ ఔషధ చికిత్స (ఓఅ) ద్వారా దీన్ని నయం చేయవచ్చు అని, ప్రారంభంలోనే జబ్బును గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే సులభముగా అంగవైకల్యం రాకుండా కుష్టు వ్యాధిగ్రస్తులను కాపాడుకోవచ్చని లిల్లీ మేరి అన్నారు. మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నివారణ మార్గాలపై అవగాహన కార్యక్రమాలను, వ్యాధి వ్యాపించే విధానము, చికిత్స విధానము, వ్యాధిగ్రస్తుల పట్ల ఎలా వ్యవహరించాలనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తద్వారా వ్యాధి వ్యాప్తిని చాలా వరకు అరికట్టగలిగేటట్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ లిల్లీ మేరి తెలిపారు.

# 2024 కల్లా అభివృద్ధి చెందిన దేశంగా భారత్

## -ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

గాంధీనగర్ జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: భారతదేశాన్ని 2024 కల్లా అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గాంధీనగర్లోని మహాత్మా మందిర్ కన్వెన్షన్ సెంటర్లో పదవ "వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్" ను ప్రధాన మంత్రి బుధవారంనాడు ప్రారంభించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జయద్ అల్ నహ్యాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ

పదేళ్ల క్రితం ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో 11వ స్థానంలో ఉన్న ఇండియా ఈరోజు 5వ స్థానంలోకి వచ్చిందని ప్రధాని ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నారు. రాబోయే రోజుల్లో ప్రపంచంలోని మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగనుందని ప్రధాన ఏజెన్సీలన్నీ అంచనా వేస్తున్నాయని, యావత్ ప్రపంచం ఇదే అంచనాలతో ఉందని, అయితే ఇది జరిగితీరుతుందని తాను గ్యారెంటీ ఇవ్వదలచుకున్నానని మోదీ ధీమా వ్యక్తం చేశారు. అంతర్జాతీయ పరిస్థితిలు అందరికీ తెలిసిన విషయమేనని, ఇలాంటి పరిస్థితుల్లో భారత ఆర్థిక వ్యవస్థ అన్ని ప్రతికూలతలను ఎదుర్కొని అభివృద్ధిలో పురోగమన బాట పట్టడం వెనుక గత పదేళ్లలో సంస్థాగత సంస్కరణలో మనం దృష్టి సారించడమే ప్రధాన కారణమని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలతో భారత ఆర్థిక వ్యవస్థ సత్తా, సామర్థ్యం, పోటీతత్వం పెరిగిందని అన్నారు.

యూఏఈకి చెందిన కంపెనీలు ఇండియాలోని ఫోర్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్లో బిలియన్ల డాలర్లు కొత్త పెట్టుబడులతో ఒప్పందాలు కుదుర్చుకుందని మోదీ చెప్పారు. సుస్థిరతకు కీలక స్తంభంగా భారత్ వైపు ప్రపంచదేశాలు చూస్తున్నాయని అన్నారు. వైబ్రెంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్లో యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జయెద్ పాల్గొనడం తమకెంతో సంతోషంగా ఉందని చెప్పారు. ఇండియా, యూఏఈ మధ్య సంబంధాలు మరింత పరిపుష్టం కావడానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరుకావడం ఒక సంకేతమని అన్నారు.

రాబోయే 25 ఏళ్లు ఇండియాకు అమృత్ కాలం ..

భారతదేశం ఇటీవల 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పూర్తి చేసుకుందని, ఇప్పుడు రాబోయే 25 ఏళ్లపై దృష్టి సారించిందని చెప్పారు. 100 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల సమయానికి అభివృద్ధి చెందిన భారత్గా దేశాన్ని తీర్చిదిద్దడం మన ముందు ఉన్న లక్ష్యమని అన్నారు. ఆ కారణంగా రాబోయే 25 ఏళ్ల అమృత్ కాల్గా ముందుకు వెళ్తామని చెప్పారు. అమృత్ కాల్ దిశగా జరుగుతున్న తొలి వైబ్రెంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్ ఇది కావడం ఎంతో ప్రాధాన్యత కలిగిన అంశమని అన్నారు. భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో కీలక భాగస్వాములుగా 100కు పైగా దేశాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతున్నారని మోదీ తెలిపారు.

# మహాలక్ష్మి స్కీం వల్ల ఈసారి ఏపీకి తగ్గిన బస్సుల సంఖ్య

**- సంక్రాంతి స్పెషల్ బస్సుల్లో కూడా మహాలక్ష్మి పథకం అమలు**

**- టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్**

హైదరాబాద్, జనవరి 11: సంక్రాంతి పండుగ కోసం 4484 బస్సులను ప్రయాణికులకు అందుబాటులో ఉంచామని టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. బుధవారం మీడియా తో ఆర్టీసీ ఎండీ మాట్లాడుతూ.. ప్రయాణికుల రద్దీని బట్టి మరిన్ని బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. స్పెషల్ బస్సుల్లో కూడా మహాలక్ష్మి పథకం కింద మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు.అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్పై ఆర్టీఏ అధికారులతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఎంజీబీఎస్ నుంచి మాత్రమే కాకుండా ఉప్పల్, ఎల్బీనగర్, జేబీఎస్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. మహాలక్ష్మి స్కీం వల్ల ఈసారి ఏపీకి బస్సుల సంఖ్య తగ్గించామని ఆర్టీసీ ఎండి సజ్జనార్ వెల్లడించారు.

# వినియోగదారుల అవగాహన సదస్సుకు కిషన్ రెడ్డికి ఆహ్వానం

హైదరాబాద్ జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);2024 జనవరి 29 మరియు 30 తేదీల్లో నిర్వహించనున్న వినియోగదారుల ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం నికి హైదరాబాద్ రెడ్ క్రాస్ బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ మామిడి భీమ్ రెడ్డి మరియు కన్స్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సిసిఐ సభ్యులు డాక్టర్ హరిప్రియ, డాక్టర్ ఇస్సాక్ రాజ్ సమర్పించిన, శిల్పా రెడ్డి, ఓఅ సభ్యులు జ్యోతి, వీరమణి , ధర్మతేజ ప్యాట్రన్ సభ్యురాలు సుప్రబ , విన్నపం ఒక పోరాటం చీకూరి లీలావతి, శేఖర్ రెడ్డి, కోటి ధర్మ తేజ మరియు రాకేష్ ఆహ్వాన పత్రాన్ని సమర్పించారు. కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు భీమ్ రెడ్డి తెలిపారు.

# వినియోగదారుల సదస్సుకు

## మంత్రి దామోదర రాజనర్సింహను ఆహ్వానించిన రెడ్ క్రాస్



హైదరాబాద్ జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);2024 జనవరి 29 మరియు 30 తేదీల్లో నిర్వహించనున్న వినియోగదారుల ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం నికి సందర్భంగా హైదరాబాద్ రెడ్ క్రాస్ బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ మామిడి భీమ్ రెడ్డి, కన్స్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అఅఎ సభ్యులు డాక్టర్ హరిప్రియ, డాక్టర్ ఇస్సాక్ రాజ్, శిల్పా రెడ్డి, విన్నపం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలు చీకూరి లీలావతి, ఓఅ సభ్యులు వీరమణి , జ్యోతి,ధర్మతేజ, సత్యనారాయణ రెడ్డి, నర్సింహారెడ్డి, సంజీవ్ గుప్త, అబ్దుల్ మజీద్, సయ్యద్, సుప్రబ, ,శేఖర్ రెడ్డి, కోటి ధర్మ తేజ ఆహ్వాన పత్రాన్ని సమర్పించారు.

# భూమి శిస్తుకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు వడ్డే ఓబన్న - జిల్లా కలెక్టర్ రాజర్షి షా.

మెదక్, జనవరి 11:(నేటినిజం ప్రతినిధి):స్వాతంత్ర పోరాటంలో వడ్డే ఓబన్న వీరోచిత పోరాటం భావితరాలకు చాటి చెప్పాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్డే ఓబన్న జయంతి వేడుకలలో పాల్గొని జ్యోతి ప్రజ్వల చేసి వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంచార జాతికి చెందిన వడ్డే కులంలో సుబ్బన్న సుబ్బమ్మలకు 11 జనవరి,1807లో వడ్డే ఓబన్న జన్మించారన్నారు. ఉయ్యాలవాడ నరసింహ రెడ్డి స్థాపించిన సైన్యానికి సైన్యాధిపతిగా ఉంటూ పోరాటాలు చేశాడని,స్వతంత్ర పోరాటంలో వడ్డే ఓబన్న పాత్రకిలకమని, వారి వీరోచిత పోరాటాల స్ఫూర్తిని భావితరాలకు చాటి చెప్పాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అధికారి నాగరాజు,మనోహర్,సుమన్, నర్సింలు,బీసీ సంఘం అధ్యక్షుడు దుర్గ సాయిలు,ఎల్లయ్య, పెంటయ్య,అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# మత, కుల, పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ అందిస్తున్న ఏకైక సిఎం జగన్-పెద్దిరెడ్డి

అమరావతి, జనవరి 11:శ్రీ సత్యసాయి జిల్లా: వచ్చే ఎన్నికల్లో సీఎం వైయస్ జగన్ , చంద్రబాబు పాలన బేరీజు వేసుకుని ప్రజలు ఓటు వేయాలనిమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. హిందూపూర్ నియోజకవర్గంలో పర్యటనలో ఉన్న మంత్రి మీడియాతో మాట్లాడుతూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు 99.5 శాతం అమలు చేసిన ఘనత జగన్ దే అన్నారు.

కరోనా సమయంలో స్తానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, నారా లోకేష్.. హైదరాబాద్ లో దాక్కున్నారని దుయ్యబట్టారు. సీఎం వైయస్ జగన్ ఎక్కడా కులాలు, మతాలు, పార్టీలు చూడలేదని .. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించారని ప్రశంసలు కురిపించారు. పాలన అంతా ప్రజల ఇంటి ముందు ఉన్న సచివాలయంలోనే ఉందన్నారు .తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో లాగా జన్మభూమి కమిటీలను వేసి ప్రజల్ని దోచుకునే పరిస్థితి లేదన్నారు.. నేరుగా సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్న ఏకైక సిఎం జగనే అంటూ ని కొనియాడారు.. ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా.. సీఎం బటన్ నొక్కి లబ్ధిచేకూరుస్తున్నారని తెలిపారు. మరోవైపు.. పెన్షన్ లు పెంచి రూ మూడు వేలు చేస్తే పెన్షన్ ఇవ్వరు అంటూ టీడీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

# డీఎంకేకు చెందిన సగం మంది మంత్రులు జైలుకే వెళ్తారు..

**- బీజేపీ నేత హెచ్.రాజా సంచలన కామెంట్స్..**

పెరంబూర్(చెన్నై) జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికలు జరిగే లోపు డీఎంకేకు చెందిన సగం మంది మంత్రులు జైల్లలో ఉంటారని బీజేపీ మాజీ జాతీయ కార్యదర్శి హెచ్.రాజా చెప్పారు. శివగంగలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలో ఏర్పాటు కానున్న కూటమి పార్లమెంటు ఎన్నికల్లో ఘనవిజయం సాధిస్తుందన్నారు. 'ఇండియా' కూటమి పార్టీల్లో ఐక్యత లేదన్నారు. కేరళలో కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కలిసి పోటీచేసే అవకాశం లేదని, దానిని బట్టి ఆ కూటమి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. అయోధ్య రామాలయం కుంభాభిషేకం జరిగే సమయంలో రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో విశేష పూజలు, కుంభాభిషేక ఉత్సవాలను ప్రత్యక్ష ప్రసారం చేసేలా రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ చర్యలు చేపట్టాలని హెచ్.రాజా డిమాండ్ చేశారు.

# ఆంధ్రప్రదేశ్లో శరవేగంగా మారిపోతున్న రాజకీయ సమీకరణలు

అమరావతి జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఆంధ్రప్రదేశ్లో సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతుండటంతో రాజకీయ సమీకరణలు శరవేగంగా మారిపోతున్నాయ్. నియోజకవర్గాల ఇంచార్జుల మార్పు తర్వాత పరిణామాలతో వైసీపీ ఢీలా పడగా.. తెలుగుదేశం మాత్రం యమా జోష్లో ఉంది. ఎందుకంటే.. వైసీపీలో సీట్లు రాని ఎమ్మెల్యేలు, ఎంపీలు పసుపు కండువా కప్పుకోవ డానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు ముహూర్తం కూడా ఫిక్స్ చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మరీ ముఖ్యంగా బెజవాడ రాజకీయాలు ఎన్నికలకు ముందే కాకరేపుతున్నాయి. వారం రోజులుగా టీడీపీ ఎంపీ కేశినేని నాని వైసీపీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఎపిసోడ్లు రాష్ట్ర రాజకీ యాల్లో హాట్ టాపిక్గా మారాయి.

**ఇంతకీ ఎవరా ఎంపీ..?**

తాజాగా అందుతున్న సమాచారం మేరకు ఎంపీ కేశినేని నాని.. తన కుమార్తె కేశినేని శ్వేతతో కలిసి వైసీపీ తీర్థం పుచ్చుకోబోతున్నారట. ఇవాళ సాయంత్రం (బుధవారం) సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో భేటీ కాబతున్నారని తెలుస్తోంది. అంతకుముందే కేశినేని కూడా టీడీపీకి రాజీనామా చేసే ఛాన్స్ ఉంది. మొదట వారం, పదిరోజుల్లో టీడీపీకి గుడ్ బై చెప్పి.. వైసీపీ తీర్థం పుచ్చుకుంటారని వార్తలు వచ్చినప్పటికీ ఇక ఆలస్యం చేయకుండా జగన్తో భేటీ కావాలని నాని భావించారట. వైసీపీ కండువా కప్పుకున్నాక విజయవాడ పార్లమెంటు స్థానం నుంచే కేశినేనిని వైసీపీ అభ్యర్థిగా అధిష్టానం బరిలోకి దింపే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే.. నాని పోటీచేయని పక్షంలో శ్వేతకు ఎంపీ టికెట్ ఆఫర్ చేస్తామని వైసీపీ హామీ ఇచ్చినట్లుగా కూడా వార్తలు వినవస్తున్నాయి. జగన్తో భేటీ తర్వాత టికెట్ విషయంపై సస్పెన్స్ వీడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కాగా.. 2024 ఎన్నికల్లో తాను పోటీచేయనని టీడీపీ అధినేత చంద్రబాబుకు పలుమార్లు కేశినేని చెప్పారు. నాటి నుంచే నాని.. వైసీపీ ఎమ్మెల్యేలు, వైసీపీ నేతలతో కలివిడిగా ఉంటున్నారు. ఎందుకిలా చేస్తున్నారని అడిగితే మాత్రం హైకమాండ్పై అలకబూనడం, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా ఎగ్గొట్టడం లాంటివి చేసిన సందర్భాలు కోకొల్లలు. ఇవన్నీ ఒక ఎత్తయితే.. ఎంపీ నియోజకవర్గ నిధులు కూడా వైసీపీ ఎమ్మెల్యేలు సూచించిన వారికే ఇవ్వడం గమనార్హం. దీనిపై టీడీపీ శ్రేణులు పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేసినా 'ప్రోటోకాల్' పేరుతో నాని తన విధానాన్ని సమర్థించుకునేవారు. ఇంత చేసినా క్యాడర్ మాత్రం కేశినేనితో ఉన్నా.. చివరాకరికి నాని పార్టీని వీడటానికి సిద్ధం కావడంతో పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నాయి.

ఎమ్మెల్యే ఈయనే..?

పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథికి ఈ ఎన్నికల్లో టికెట్ ఇవ్వట్లేదని.. మచిలీపట్నం నుంచి ఎంపీగా పోటీచేయాలని వైసీపీ అధిష్టానం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందాయి. అయితే.. తాను ఎమ్మెల్యేగా, అది కూడా పెనమలూరు నుంచి మాత్రమే పోటీచేస్తానని హైకమాండ్కు తెగేసి చెప్పేశారు. ఈ క్రమంలో ఒకరిద్దరు కీలకనేతలను రంగంలోకి దింపి పార్థసారథితో మంతనాలు జరిపింది. మూడు దఫాలుగా జరిపిన చర్చలు కూడా ఫలించలేదు. అయితే.. ఆయన మాత్రం తగ్గేదేలా.. టికెట్ ఇస్తే సరే లేకుంటే వైసీపీలో కొనసాగలేనని.. టీడీపీలో చేరతానని చెప్పేశారట. ఈ ఎపిసోడ్ అనంతరం టీడీపీ అధినేత చంద్రబాబుకు పార్థసారథి టచ్లోకి వెళ్లారట. పెనమలూరు నుంచి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడానికే టీడీపీ అధిష్టానం ఫిక్స్ అయ్యిందట. వీలుకాని పక్షంలో నూజివీడు టికెట్ అయినా సరే ఇవ్వడానికి టీడీపీ సిద్ధంగా ఉందట. మరోవైపు.. టీడీపీ నేతలు వెలగపూడి రామకృష్ణ, బొమ్మసాని సుబ్బారావు.. సారథితో ఇప్పటికే చర్చలు జరిపారు. టీడీపీలో చేరడానికి ఎమ్మెల్యే కూడా సానుకూలంగా స్పందించారని టాక్ నడుస్తోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ నెల 18న కృష్ణా జిల్లా గుడివాడలో జరిగే చంద్రబాబు 'రా.. కదలిరా' బహిరంగ సభ కార్యక్రమంలో పార్థసారథి పసుపు కండువా కప్పుకుంటారట. ఇలా ఒకరిద్దరే కాదు.. మరో సిట్టింగ్ ఎంపీ, ఎమ్మెల్యేలు.. నెల్లూరు నుంచి బడా నేత.. టీడీపీలోకి టచ్లోకి వెళ్లారట. ముమ్ముందు ఇంకా ఎంత మంది నేతలు జంపింగ్లు అవుతారో చూడాలి మరి.

# రాష్ట్రస్థాయి యువజనోత్సవాలలో మెదక్ జిల్లా వాసి స్ఫూర్తి కి రెండవ బహుమతి.

మెదక్, జనవరి 11:(నేటినిజం ప్రతినిధి):తెలంగాణ రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 5 మరియు 6 వ తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాల్లో భాగంగా ఉపన్యాస పోటీలో మెదక్ జిల్లా వాసి స్ఫూర్తి రాష్ట్రస్థాయిలో రెండవ బహుమతి గెలిచింది. ఈ సందర్భంగా జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి నాగరాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అనుమతితో డిసెంబర్ 22న మెదక్ లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఇదే నెల 5 మరియు 6 వ తేదీలలో శిల్పారామం, హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా నుండి వివిధ అంశాలలో 34 మంది కళాకారులు ఈ పోటీలలో పాల్గొనగా అందులో నుండి స్ఫూర్తికి ఉపన్యాస పోటీలలో రెండవ బహుమతి రావడం అభినందనీయం యువజన సర్వీసుల శాఖ ప్రధాన కార్యాలయం, హైదరాబాద్ నందు రేపు అనగా 12-1-2024 ఉదయం 10:30 గంటలకు ఈమెకు డైరెక్టర్ గారి చేతుల మీదుగా బహుమతి ఇవ్వనున్నట్లు ఆయన అన్నారు.

# వైబ్రాన్ట్ గుజరాత్ గ్లోబల్ సమిట్ యొక్క పదో సంచికను ప్రారంభించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జనవరి 11:వైబ్రాన్ట్ గుజరాత్ గ్లోబల్ సమిట్ 2024 యొక్క పదో సంచిక ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న గాంధీనగర్ లోని మాహాత్మ మందిర్ లో ప్రారంభించారు. 'భవిష్యత్తు కు ప్రవేశ ద్వారం' అనేది ఈ సంవత్సరం లో శిఖర సమ్మేళనం తాలూకు ఇతివృత్తం గా ఉంది. మరి, ఈ కార్యక్రమం లో 34 భాగస్వామ్య దేశాలు, ఇంకా 16 భాగస్వామ్య నంస్థలు పాలుపంచుకొంటున్నాయి. దేశం లోని ఈశాన్య ప్రాంతాల లో పెట్టుబడి పెట్టడానికి ఉన్న అవకాశాల ను వివరించడానికి ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ శిఖర సమ్మేళనాన్ని ఒక వేదిక గా కూడా ఉపయోగించుకొంటోంది.

పరిశ్రమ రంగ సారథులు అనేక మంది ఈ కార్యక్రమం లో ప్రసంగించారు. సభికుల ను ఉద్దేశించి ఆర్సెలర్ మిత్తల్ యొక్క చైర్ మన్ శ్రీ లక్ష్మీ మిత్తల్, జపాన్ లో గల సుజుకి మోటర్ కార్పొరేశన్ యొక్క అధ్యక్షుడు శ్రీ తోశిహిరో సుజుకీ, రిలయన్స్ గ్రూపు నకు చెందిన శ్రీ ముఖేశ్ అంబాని, యుఎస్ఎ లోని మైక్రోన్ టెక్నాలజీస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీ సంజయ్ మెహ్‌రోత్ర, అదాణి గ్రూప్ చైర్ మన్ శ్రీ గౌతమ్ అదాణి, దక్షిణ కొరియా లో సిమ్ టెక్ సంస్థ సిఇఒ శ్రీ జెఫ్‌రీ చూన్, టాటా సన్స్ లిమిటెడ్ చైర్ మన్ శ్రీ ఎన్. చంద్రశేఖరన్, డిపి వరల్డ్ యొక్క చైర్ మన్ శ్రీ సుల్తాన్ అహమద్ బిన్ సులేయమ్, ఎన్‌వీడియా యొక్క సీనియర్ వైస్ ప్రెసిడెంటు శ్రీ శంకర్ త్రివేది లతో పాటు జెరోధా యొక్క వ్యవస్థాపకుడు మరియు సిఇఒ శ్రీ నిఖిల్ కామత్ కూడా ప్రసంగించడం తో పాటుగా వారి యొక్క వ్యాపార ప్రణాళికల ను తెలియ జేశారు. ఈ వ్యాపార రంగ ప్రముఖులు ప్రధాన మంత్రి యొక్క దృష్టికోణాన్ని ప్రశంసించారు.

వైబ్రాన్ట్ గుజరాత్ గ్లోబల్ సమిట్ లో ప్రసంగించిన వారి లో జపాన్ కు చెందిన అంతర్జాతీయ వ్యవహారాల ఉప మంత్రి శ్రీ శిన్ హోసాకా, సౌదీ అరేబియా కు చెందిన పెట్టుబడి శాఖ సహాయ మంత్రి శ్రీ ఇబ్రాహీమ్ యూసఫ్ అలీ ముబారక్, మధ్య ప్రాచ్యానికి చెందిన సహాయ మంత్రి శ్రీ తారీక్ అహమద్, ఉత్తర ఆఫ్రికా, దక్షిణ ఆసియా, కామన్ వెల్త్ మరియు ఐక్య రాజ్య సమితి, యుకె ల ప్రతినిధి శ్రీ వహన్ కెరోబియాన్, అర్మేనియా ఆర్థిక వ్యవహారాలు, సమాచార సాంకేతిక విజ్ఞానం శాఖ మంత్రి శ్రీ టీత్ రీసాలో, మొరాకో కు చెందిన పరిశ్రమ మరియు వాణిజ్య శాఖ మంత్రి శ్రీ రయద్ మిజూర్, నేపాల్ యొక్క ఆర్థిక మంత్రి శ్రీ ప్రకాశ్ శరణ్ మహత్, వియత్‌నామ్ ఉప ప్రధాని శ్రీ ట్రాన్ లూ కువాంగ్, చెక్ గణతంత్రం యొక్క ప్రధాని శ్రీ పీటర్ ఫియాల, మొజాంబిక్ యొక్క అధ్యక్షుడు శ్రీ ఫిలిప్ న్యూసీ లతో పాటు తిమోర్-లెస్తె యొక్క అధ్యక్షుడు శ్రీ జోస్ రామోస్-హోర్టా లు ఉన్నారు. శిఖర సమ్మేళనం యొక్క ఆరంభం లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ యొక్క అధ్యక్షుడు మరియు అబూ ధాబీ యొక్క పాలకుడు శ్రీ శేఖ్ మొహమ్మద్ బిన్ జాయద్ అల్ నాహ్ యాన్ కూడా ప్రసంగించారు.

సభికుల ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, ముందు గా 2024వ సంవత్సరాని కి గాను శుభాకాంక్షల ను తెలియ జేశారు. రాబోయే ఇరవై అయిదు సంవత్సరాల లో 2047 కల్లా భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశం గా తీర్చిదిద్దే ప్రతిజ్ఞ ను ఆయన పునరుద్ఘాటించారు. "క్రొత్త కలల ను కనడానికి, క్రొత్త సంకల్పాల ను తీసుకోవడాని కి మరియు నిరంతర కార్యసాధనల కు సంబంధించిన కాలం ఇది" అని ఆయన అన్నారు. 'అమృత కాలం' లో ఒకటో వైబ్రాన్ట్ గుజరాత్ సమిట్ కు ఉన్న ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు.

వైబ్రాన్ట్ గుజరాత్ గ్లోబల్ సమిట్ ముఖ్య అతిథి గా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) యొక్క అధ్యక్షుడు మరియు అబూ ధాబీ యొక్క పాలకుడు అయినటువంటి శ్రీ శేఖ్ మొహమ్మద్ బిన్ జాయద్ అల్ నాహ్ యాన్ పాలుపంచుకోవడం ఎంతో ప్రత్యేకమైంది అని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. ఈ పరిణామం భారతదేశాని కి మరియు యుఎఇ కి మధ్య గాఢతరం గా మారుతున్నటువంటి సంబంధాల ను తెలుపుతోందని ఆయన అన్నారు. భారతదేశాన్ని గురించిన తన ఆలోచన లు మరియు మద్దతు స్నేహశీలత్వం తోను, సౌహార్దం తోను నిండి ఉన్నాయి అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. ఆర్థిక అభివృద్ధి మరియు పెట్టుబడి కి సంబంధించిన చర్చల తాలూకు ఒక ప్రపంచ వేదిక గా వైబ్రాన్ట్ గుజరాత్ గ్లోబల్ సమిట్ మారుతోందని ఆయన అన్నారు. నవీకరణ యోగ్య శక్తి రంగం , నూతన ఆవిష్కరణల తో కూడిన ఆరోగ్య సంరక్షణ రంగాల కు తోడు భారతదేశం లో నౌకాశ్రయాలకు సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పన లో కోటానుకోట్ల డాలర్ విలువైన పెట్టుబడులు వంటి అంశాల లో హెచ్చుతున్న సమర్థన లో భారతదేశం-యుఎఇ భాగస్వామ్యాని ది కీలక పాత్ర అని ఆయన ప్రముఖం గా ప్రకటించారు. యుఎఇ కి చెందిన సావరిన్ వెల్త్ ఫండ్ తన కార్యకలాపాల ను జిఐఎఫ్‌టి సిటీ లో మొదలు పెట్టిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. అంతేకాకుండా విమానాల ను మరియు నౌకల ను లీజు కు ఇచ్చే కార్యకలాపాల లో ట్రాన్స్ వరల్డ్ కంపెనీ లు ముందుకు రావడాన్ని గురించి కూడా ఆయన వెల్లడించారు. భారతదేశాని కి మరియు యుఎఇ కి మధ్య సంబంధాలు అంతకంతకు వృద్ధి చెందుతున్నాయంటే ఆ ఖ్యాతి శ్రీ శేఖ్ మొహమ్మద్ బిన్ జాయద్ అల్ నాహ్ యాన్ కే చెందుతుంది అని ప్రధాన మంత్రి అన్నారు.

ఐఐఎమ్ అహమదాబాద్ లో పూర్వ విద్యార్థి మరియు మొజాంబిక్ అధ్యక్షుడైన శ్రీ ఫిలిప్ న్యూసీ ఈ కార్యక్రమం లో పాల్గొంటున్న విషయాన్ని గురించి ప్రధాన మంత్రి ప్రస్తావించారు. జి-20 కి భారతదేశం అధ్యక్షత వహించిన కాలం లోనే ఆఫ్రికన్ యూనియన్ జి-20 లో శాశ్వత సభ్యత్వ దేశం గా చేరడం గర్వకారణం అని ప్రధాన మంత్రి అన్నారు. అధ్యక్షుడు శ్రీ న్యూసీ ఈ కార్యక్రమాని కి తరలి రావడం భారతదేశం-మొజాంబిక్ సంబంధాల తో పాటు, భారతదేశం-ఆఫ్రికా సంబంధాల ను కూడా గాఢతరం గా మార్చివేసింది అని ప్రధాన మంత్రి అన్నారు.

చెక్ రిపబ్లిక్ యొక్క ప్రధాని శ్రీ పీటర్ ఫియాల మొట్టమొదటిసారి గా తమ దేశాని కి ప్రధాని హోదా లో భారతదేశాన్ని సందర్శిస్తుండడాన్ని గురించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మాట్లాడుతూ, ఇది ఒక్క భారతదేశం తోనే కాకుండా వైబ్రాన్ట్ గుజరాత్ తో కూడా చెక్ గణతంత్రాని కి ఉన్నటువంటి పురాతన సంబంధాల ను సూచిస్తోందన్నారు. ఆటో మొబైల్ రంగం, సాంకేతిక విజ్ఞాన రంగం మరియు తయారీ రంగాల లో సహకారాన్ని గురించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రస్తావించారు.

నోబెల్ బహుమతి గ్రహీత మరియు తిమోర్-లెస్తె యొక్క అధ్యక్షుడైన శ్రీ జోస్ రామోస్-హోర్టా కు ప్రధాన మంత్రి స్వాగతం పలుకుతూ, వారి దేశం లో స్వాతంత్ర్య సమరం వేళ గాంధీ మహాత్ముని అహింస సిద్ధాంతాన్ని ఆచరణ లో పెట్టిన సంగతి ని ప్రముఖం గా ప్రకటించారు.

వైబ్రాన్ట్ గుజరాత్ సమిట్ యొక్క 20 వ వార్షిక కార్యక్రమాన్ని గురించి ప్రధాన మంత్రి చెప్తూ, ఈ శిఖర సమ్మేళనం క్రొత్త క్రొత్త ఆలోచనల ను ప్రతిబింబించింది. పెట్టుబడుల కు మరియు ప్రతిఫలాల కు సరిక్రొత్త ప్రవేశ ద్వారాల ను తెరచింది అన్నారు. ఈ సంవత్సరం లో 'భవిష్యత్తు కు ప్రవేశ ద్వారం' అనేది ఇతివృత్తం గా ఉన్న సంగతి ని ప్రధాన మంత్రి వివరిస్తూ, 21 వ శతాబ్దం యొక్క భవితవ్యం ఉమ్మడి ప్రయాస ల వల్ల ప్రకాశవంతం అవుతుంది అన్నారు. భారతదేశం జి-20 కి అధ్యక్షత వహించిన కాలం లో భవిష్యత్తు కు సంబంధించిన ఒక మార్గసూచీ ని సమర్పించడమైంది. మరి, దీనిని వైబ్రాన్ట్ గుజరాత్ గ్లోబల్ సమిట్ యొక్క దార్శనికత మరింత ముందుకు తీసుకుపోతున్నది అన్నారు. ఐ2యు2 తో మరియు ఇతర బహువక్షీయ నంస్థల తో భాగస్వామ్యాన్ని బలపరచుకోవడం జరుగుతోందని , అదే కాలం లో 'ఒక ప్రపంచం, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు' తాలూకు సూత్రాలు ప్రస్తుతం ప్రపంచ సంక్షేమాని కి ఒక ముందస్తు అవసరం గా మారిపోయాయన్న సంగతి ని కూడా ను ఆయన ప్రస్తావించారు.

"శర వేగం గా మార్పుల కు లోనవుతున్న ప్రపంచం లో ఒక 'విశ్వ మిత్ర' వంటి పాత్ర ను భారతదేశం పోషిస్తూ మునుముందుకు కదులుతోంది. ఉమ్మడి సామూహిక లక్ష్యాల ను సాధించడం లో ప్రపంచాని కి ప్రస్తుతం భారతదేశం విశ్వాసాన్ని కలిగించింది. ప్రపంచ సంక్షేమానికై భారతదేశం యొక్క వచనబద్ధత, భారతదేశం నడుం కట్టినటువంటి ప్రయాస లు మరియు భారతదేశం చేస్తున్నటువంటి కఠోర శ్రమ ప్రపంచాన్ని సురక్షితం గా, సమృద్ధం గా మార్చుతున్నాయి. స్థిరత్వ స్థాపన లో ఒక ముఖ్యమైన స్తంభం గాను, నమ్మగలిగిన ఒక మిత్ర దేశం గాను, ప్రజలే కేంద్ర స్థానం లో నిలబడి ఉండే అభివృద్ధి సాధన పట్ల నమ్మకం కలిగిన ఒక భాగస్వామ్య దేశం గాను, ప్రపంచ హితం పట్ల విశ్వాసం ఉంచిన ఒక స్వరం గాను, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ లో ఒక వృద్ధి చోదక శక్తి గాను, పరిష్కారాల ను కనుగొనడం లో సాంకేతిక విజ్ఞానం ప్రధానమైన దేశం గాను, ప్రతిభావంతులైన యువ శక్తి ని కలిగివున్న ఒక పవర్ హౌస్ గాను మరియు ఫలితాల ను అందించేటటువంటి ఒక ప్రజాస్వామ్య దేశం గాను భారతదేశం కేసి ప్రపంచం తన దృష్టి ని సారిస్తున్నది" అని ప్రధాన మంత్రి వివరించారు.

"దేశంలోని 140 కోట్లమంది పౌరుల ప్రాథమ్యాలు, ఆకాంక్షలు, మానవ-కేంద్రక ప్రగతిపై వారి విశ్వాసంతోపాటు సార్వజనీనత, సమానత్వంపై ప్రభుత్వ నిబద్ధతలు ప్రపంచ శ్రేయస్సుకు, అభివృద్ధికి ప్రధానాంశాలు" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. అలాగే ఇవాళ ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ 10 సంవత్సరాల కిందట 11వ స్థానంలో ఉండేదని గుర్తుచేశారు. ప్రపంచంలోని వివిధ రేటింగ్ సంస్థల అంచనాల మేరకు రాబోయే కొన్నేళ్లలోనే ప్రపంచంలోని మూడు అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ ఆవిర్భవిస్తుందని ఆయన నొక్కిచెప్పారు. "నిపుణులు దీనిపై తమ విశ్లేషణ చెప్పగలరు... కానీ, భారత్ ప్రపంచంలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం ఖాయమని నేను హామీ ఇస్తున్నాను" అని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. ప్రపంచం అనేక భౌగోళిక-రాజకీయ అస్థిరతలను చవిచూసిన సమయాల్లో భారత్ ప్రపంచానికి ఆశాకిరణంగా మారిందని ఆయన గుర్తుచేశారు.

భారత ప్రాథమ్యాలు ఉజ్వల గుజరాత్ ప్రపంచ సదస్సులో ప్రతిఫలించటాన్ని ప్రస్తావిస్తూ- సుస్థిర పరిశ్రమలు, తయారీ, మౌలిక సదుపాయాలు, నవయుగ నైపుణ్యాలు, భవిష్యత్ సాంకేతికతలు, కృత్రిమ మేధ-ఆవిష్కరణలు, హరిత ఉదజని, పునరుత్పాదక ఇంధనం, సెమికండక్టర్స్ వగైరాలను ప్రధానమంత్రి ఉదాహరించారు. గుజరాత్‌లో వాణిజ్య ప్రదర్శనను ప్రతి ఒక్కరూ... ముఖ్యంగా పాఠశాలలు-కళాశాలల విద్యార్థులు సందర్శించాలని ప్రధాని మోదీ కోరారు. నిన్న గౌరవనీయ న్యుసి, రామోస్ హోర్టాలతో సంయుక్తంగా ఈ వాణిజ్య ప్రదర్శనను తిలకించడాన్ని ఆయన గుర్తుచేశారు. విద్యుత్ రవాణా (ఇ-మొబిలిటీ) వంటి రంగాల్లో అంతర్జాతీయ స్థాయి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసిన ఉత్పత్తులు ఇందులో ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. అంకుర సంస్థలు, నీలి ఆర్థిక వ్యవస్థ, హరిత ఇంధనం, అత్యాధునిక మౌలిక సదుపాయాలు వంటి రంగాలన్నిటా పెట్టుబడులకు నిరంతరం కొత్త అవకాశాలు అందివస్తున్నాయని తెలిపారు.

ఆర్థిక వ్యవస్థ పురోగమన వేగం, పునరుత్థానానికి ప్రాతిపదికగా వ్యవస్థాగత సంస్కరణలపై భారత్ దృష్టి సారించడం గురించి ప్రధాని మోదీ వివరించారు. ఈ సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థ శక్తి, సామర్థ్యం, పోటీతత్వం పెరిగాయని తెలిపారు. మూలధన పునర్వ్యవస్థీకరణ, ఆర్థిక అశక్తత-దివాలా స్మృతి (ఐబిసి) వల్ల బ్యాంకింగ్ వ్యవస్థ పటిష్ఠంగా రూపొందినట్లు ప్రధాని చెప్పారు. ఈ మేరకు దాదాపు 40 వేల అనవసర నిబంధనలను రద్దు చేయడంతో వాణిజ్య సౌలభ్యం ఏర్పడిందని, వస్తుసేవల పన్ను (జిఎస్‌టి)తో పన్ను సంబంధిత చిక్కులు తొలగి, ప్రపంచ సరఫరా వ్యవస్థలో వైవిధ్యభరిత వాతావరణం నెలకొందని వివరించారు.

ఇటీవల యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)సహా మూడు దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఎఫ్‌టిఎ)పై సంతకాలు పూర్తయ్యాయని తెలిపారు. వీటిద్వారా పలు రంగాల్లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు స్వయంచలితంగా ప్రవహించే వెసులుబాటు కలిగిందని చెప్పారు. మౌలిక సదుపాయాలపై రికార్డు స్థాయిలో పెట్టుబడులు, మూలధన వ్యయం 5 రెట్లు పెరగడం వంటివాటిని ఉదాహరించారు. అలాగే హరిత-ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అభివృద్ధిలో అద్భుత పురోగమనం, పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 3 రెట్లు పెరగడం, సౌరశక్తి ఉత్పాదక సామర్థ్యం 20 రెట్లు పెరగడాన్ని గుర్తుచేశారు. ఇంటర్నెట్ డేటా చౌకగా లభిస్తుండటం డిజిటల్ సార్వజనీనతకు దోహదం చేసిందని చెప్పారు. ఇప్పుడు ప్రతి గ్రామానికీ ఆప్టికల్ ఫైబర్ సంధానం ఉందని, దేశంలో 5జి సదుపాయం ప్రారంభంతోపాటు 1.15 లక్షల నమోదిత అంకుర సంస్థలతో భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద అంకుర పర్యావరణ వ్యవస్థగా రూపొందిందని వెల్లడించారు. అంతేకాకుండా ఎగుమతులలో రికార్డు స్థాయి పెరుగుదలను కూడా ప్రధాని ఉటంకించారు.

భారతదేశంలో పరివర్తనాత్మక మార్పులతో జీవన సౌలభ్యం మెరుగుపడటమేగాక ప్రజలకు సాధికారత కలుగుతున్నదని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. గడచిన ఐదేళ్లలో 13.5 కోట్ల మందికిపైగా ప్రజలు పేదరిక విముక్తులు కాగా, మధ్యతరగతి సగటు ఆదాయం నిరంతరం పెరుగుతోందన్నారు. దేశ శ్రామికశక్తిలో మహిళా భాగస్వామ్యం రికార్డు స్థాయిలో పెరుగుతున్నదని, భారత ఉజ్వల భవితకు ఇది సానుకూల సంకేతమని ప్రధాని చెప్పారు. "ఈ స్ఫూర్తితో భారత పెట్టుబడుల పయనంలో భాగస్వాములు కావాల్సిందిగా మీకందరికీ నా విజ్ఞప్తి" అని ప్రధానమంత్రి ఆహ్వానం పలికారు. తూర్పు ప్రాంతానికి ప్రాధాన్యంతో రవాణా రంగం పరంగా ఆధునిక విధానాల్లో మెరుగుదలను ఆయన వివరించారు. ఒక దశాబ్ద కాలంలో దేశంలోని విమానాశ్రయాల సంఖ్య 74 నుంచి 149కి పెరిగిందని, జాతీయ రహదారుల నెట్‌వర్క్ రెట్టింపు కాగా, మెట్రో నెట్‌వర్క్ 3 రెట్లు పెరిగిందని తెలిపారు. అలాగే ప్రత్యేక రవాణా కారిడార్లు, జాతీయ జలమార్గాల అభివృద్ధిని ప్రధానమంత్రి ప్రముఖంగా వివరించారు. ఓడరేవులలో నౌకలు వేచి ఉండే సమయం కూడా తగ్గిందని, జి-20 సందర్భంగా భారత-మధ్యప్రాచ్య-ఐరోపా ఆర్థిక కారిడార్ ఏర్పాటు గురించి ప్రకటించామని గుర్తుచేస్తూ- "మీకందరికీ ఇవి భారీ పెట్టుబడి అవకాశాలు" అని సూచించారు.

చివరగా- భారతదేశంలో నలుమూలలా పెట్టుబడిదారులకు కొత్త అవకాశాలు అపారమని, ఇందుకు ఉజ్వల గుజరాత్ సదస్సు ముఖద్వారం.. భవిష్యత్తుకు సింహద్వారం వంటిదని అభివర్ణించారు. "మీరు భారతదేశంలో పెట్టుబడి పెట్టడమే కాకుండా నవతరం యువ సృష్టికర్తలతో పాటు వినియోగదారులను రూపొందిస్తారు. ఆ మేరకు భారత యువతరంతో మీ భాగస్వామ్యం మీకు అనూహ్య ఫలితాలనివ్వగలదు" అంటూ ప్రధాని మోదీ తన ప్రసంగం ముగించారు.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రెసిడెంట్-అబుధాబి పాలకుడు గౌరవనీయ షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, మొజాంబిక్ అధ్యక్షుడు మిస్టర్ ఫిలిప్ న్యుసి, తైమూర్-లెస్టే అధ్యక్షుడు మిస్టర్ జోస్ రామోస్-హోర్టా, చెక్ రిపబ్లిక్ ప్రధానమంత్రి, మిస్టర్ పెత్ర్ ఫియాలా, వియత్నాం ప్రధానమంత్రి శ్రీ ట్రాన్ లూ క్వాంగ్, గుజరాత్ రాష్ట్ర గవర్నర్ శ్రీ ఆచార్య దేవవ్రత్, ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్ తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీ నరేంద్ర మోదీ 2003లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తన దార్శనిక నాయకత్వంలో ఉజ్వల గుజరాత్ ప్రపంచ సదస్సుకు రూపమిచ్చారు. ఈ వేదిక నేడు వ్యాపార సహకారం, విజ్ఞానభాగస్వామ్యంతోపాటు సమ్మిళిత-సుస్థిర అభివృద్ధి దిశగా వ్యూహాత్మక భాగస్వామ్యాలకు అత్యంత ప్రసిద్ధ ప్రపంచ వేదికగా రూపాంతరం చెందింది. ఈ నేపథ్యంలో ఉజ్వల గుజరాత్ 10వ ప్రపంచ సదస్సు 2024 జనవరి 10-12 తేదీల మధ్య గాంధీనగర్‌లో నిర్వహించబడుతుంది. ఈసారి 'భవిష్యత్తుకు సింహద్వారం' (గేట్‌వే టు ది ఫ్యూచర్) ఇతివృత్తంగా జరిగే ఈ కార్యక్రమంలో "రెండు దశాబ్దాల ఉజ్వల గుజరాత్ సదస్సు విజయోత్సవం" కూడా నిర్వహిస్తారు.

ఈ ఏడాది సదస్సు నిర్వహణలో 34 భాగస్వామ్య దేశాలు, 16 భాగస్వామ్య సంస్థలు పాల్గొంటున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈశాన్య భారతంలో పెట్టుబడి అవకాశాలను వివరించే వేదికగా సదస్సును సద్వినియోగం చేసుకుంటుంది.

ఈసారి సదస్సులో- పరిశ్రమ 4.0, సాంకేతికత-ఆవిష్కరణలు, సుస్థిర తయారీ రంగం, హరిత ఉదజని, విద్యుదాధారిత రవాణా, పునరుత్పాదక ఇంధనం, సుస్థిరత దిశగా పరివర్తన వంటి ప్రపంచ ప్రాధాన్యంగల అంశాలపై చర్చాగోష్ఠులు, సమావేశాలుసహా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

# చిన్న మొత్తమే.. అయినా వారి జీవితాలకు గోరంత దీపం -జగన్

అమరావతి, జనవరి 11: జగనన్న తోడు నిధులు నేడు విడుదలయ్యాయి. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ఈ కార్యక్రమం లో పాల్గొని ఒక్కొక్కరికి 10 వేల రూపాయల రుణం అందించారు సీఎం జగన్. నిధులను బటన్ నొక్కి లబ్దిదారుల ఖాతాలో జమ చేశారు జగన్.. దీని వల్ల 3,95,000 చిరు వ్యాపారులకు లబ్ది చేకూరింది.

ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ..దేవుని దయతో ఈరోజు మరో మంచి కార్యక్రమం జరుగుతోందన్నారు. లక్షల మంది చిరు వ్యాపారులకు మంచి జరిగించే మంచి కార్యక్రమం అని కొనియాడారు. పరిస్థితి ఎలా ఉంటుంది, వీళ్ల బతుకులు ఎలా ఉంటాయనేది మన కళ్ల ఎదుటే కనిపిస్తున్నా వాళ్ల బతుకులు ఎలా మార్చాలి, వీళ్లకు డబ్బులు పుట్టాలి, వ్యాపారాలు చేసుకోవాలంటే వీళ్ల పడుతున్న కష్టాలేమిటి అని బహుశా ఎప్పుడూ ఎవరూ ఇంత ఆలోచన చేయలేదని వెల్లడించారు. నా కళ్ల ఎదుట కనిపించినప్పుడు, దాదాపు నా పాదయాత్ర వల్ల జరిగిన పరిస్థితుల ంగానీ, ప్రతి జిల్లాలోనూ ఇది కనిపించేదని పేర్కొన్నారు సీఎం. వారి కష్టాలు ప్రత్యక్షంగా చూడటం వల్లే ఈ పథకానికి శ్రీకారం చుట్టాను.. ఇచ్చేది చిన్న మొత్తమే అయినా వారి జీవితాలకు ఇది గోరంత దీపమని జగన్ పేర్కొన్నారు..

నిరుపేదలైన చిరు వ్యాపారులు, హస్త కళాకారులు, సంప్రదాయ చేతి వృత్తుల వారు వారి కాళ్ల మీద వారు నిలదొక్కుకొనేలా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న తోడు పథకం దేశానికే దిక్సూచిగా నిలిచిందని సీఎం పేర్కొన్నారు. ఒక్కొక్కరికి ఏటా రూ. 10 వేల రుణం సున్నా వడ్డీకే అందిస్తున్నామని, రుణాలను సకాలంలో చెల్లించినవారికి ఏడాదికి మరో రూ. 1,000 చొప్పున జోడిస్తూ రూ. 13,000 వరకు వడ్డీలేని రుణం అందిస్తున్నామన్నారు. ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో జీవిస్తూ, మరో ఒకరిద్దరికి సైతం ఉపాధి కల్పిస్తున్న చిరు వ్యాపారులు అధిక వడ్డీల బారిన పడకుండా వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. పూర్తి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ 3,95,000 మందికి ఒక్కొక్కరికి రూ. 10 వేలు, అంతకుపైన రూ. 417.94 కోట్ల వడ్డీ లేని కొత్త రుణాలు అందిస్తున్నామని చెప్పారు.

# కాంగ్రెస్‌లోకి మాజీ ఎమ్మెల్యే చేరిక



అమరావతి, జనవరి 11: పామర్రు మాజీ ఎమ్మెల్యే డివై దాస్ కు కాంగ్రెస్ బాట పట్టారు. అధిష్టానం పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరారు. విజయవాడలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్ చార్జీ, ఎంపీ మాణిక్యం ఠాగూర్,పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్ర రాజును కె.వై. దాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ ఆంధ్ర రత్న భవన్ లో కాంగ్రెస్ కండువాను మాణిక్యం ఠాగూర్ కప్పి కేవై దాస్ను పార్టీలోకి ఆహ్వానించారు . ఇకపై పార్టీ క్రియాశీలక రాజకీయాల్లో పాల్గొనాలని మాణికం ఠాగూర్ ఈ సందర్భంగా డివై దాస్ ను కోరారు.క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేయడంతో పాటు పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి తన వంతుగా శక్తి వంచన లేని కృషి చేస్తానని డి వై దాస్ అన్నారు.తన సేవలతో మాత్ర సంస్థ కాంగ్రెస్ కు పునరంకితుడ్ని అవుతానన్నారు. పార్టీలోకి తన పునః ప్రవేశం తదనంతర పరిణామాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించేందుకు త్వరలో ఓ ముఖ్య సమావేశం జరుగుతుందని ఈ సందర్భంగా డి వై దాస్ తెలిపారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్ర నాయకులు జెడి శీలం, పళ్ళంరాజు ,రఘువీరారెడ్డి, కనుమూరి బాపిరాజు , సుంకర పద్మశ్రీ, వి సంజీవరెడ్డి, మొవ్వా మోహన్ రావు, పెదపూడి దిలీప్పాల్గొన్నారు.

# ఐసిడి-11, ట్రెడిషనల్ మెడిసిన్ మాడ్యూల్ 2 ను విడుదల చేసిన డబ్ల్యూహెచ్ఓ

న్యూఢిల్లీ, జనవరి 11:ఐసిడి-11, ట్రెడిషనల్ మెడిసిన్ మాడ్యూల్ 2 ను ఈరోజు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా మాడ్యూల్ అమలుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఆయుర్వేదం, సిద్ధ, యునాని మెడిసిన్ ఆధారిత వ్యాధులకు సంబంధించిన డేటా, పరిభాషను డబ్ల్యూహెచ్ వో ఐసీడీ-11 వర్గీకరణలో చేర్చారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ తీసుకున్న నిర్ణయంతో ఆయుర్వేదం, యునాని, సిద్ధ వైద్యంలో వ్యాధులను నిర్వచించే పరిభాషను ఒక కోడ్ గా ఇండెక్స్ చేసి డబ్ల్యూహెచ్ వో డిసీజ్ క్లాసిఫికేషన్ సిరీస్ ఐసీడీ-11లో చేర్చారు.

ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రపంచ ఆరోగ్య సంస్థ సహకారంతో ఐసిడి -11 సిరీస్ టిఎం -2 మాడ్యూల్ కింద ఆయుర్వేదం, సిద్ధ మరియు యునాని వ్యవస్థలలో ఉపయోగించే వ్యాధుల వర్గీకరణను సిద్ధం చేసింది. ఈ వర్గీకరణ కోసం గతంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఆయుష్ మంత్రిత్వ శాఖ మధ్య డోనర్ అగ్రిమెంట్ కూడా కుదిరింది. ఈ ప్రయత్నం భారతదేశ ఆరోగ్య సంరక్షణ పంపిణీ వ్యవస్థ, పరిశోధన, ఆయుష్ భీమా కవరేజీ, పరిశోధన అభివృద్ధి, విధాన రూపకల్పన వ్యవస్థను మరింత బలోపేతం చేసి విస్తరిస్తుంది.ఇది కాకుండా వివిధ వ్యాధులను నియంత్రించడానికి భవిష్యత్తు వ్యూహాలను రూపొందించడానికి కూడా ఈ కోడ్లు ఉపయోగపడతాయి.

ఇండియా హాబిటాట్ సెంటర్ లో ఐసీడీ-11, టీఎం మాడ్యూల్-2ను కేంద్ర ఆయుష్, మహిళా శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ ముంజపర మహేంద్రభాయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి ఆయుష్ వైద్యాన్ని భారత్ తోపాటు ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ ప్రమాణాలతో అనుసంధానం చేయడం ద్వారా ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు.

ఆయుష్ మంత్రిత్వ శాఖ ఐసిడి -11, మాడ్యూల్ 2 ఆధారంగా భవిష్యత్తులో ప్రజారోగ్య వ్యూహాన్ని రూపొందిస్తుందని, దీనిని జాతీయంగా మరియు అంతర్జాతీయంగా అమలు చేస్తుందని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి (ఆయుష్)శ్రీ వైద్య రాజేష్ కొటేచా తెలిపారు. టీఎం మాడ్యూల్ 2 తయారీ విధానాన్ని ఆయన వివరించారు.

ఐసీడీ-11లో సంప్రదాయ వైద్య పరిభాషను చేర్చడం వల్ల సంప్రదాయ వైద్యానికి, ప్రపంచ ప్రమాణాలకు మధ్య సంబంధం ఏర్పడుతుందని భారత్ లో డబ్ల్యూహెచ్ వో ప్రతినిధి డాక్టర్ రాడారికో హెచ్ ఆఫ్రిన్ తెలిపారు. ఐసిడి -11 లో సాంప్రదాయ వైద్యానికి సంబంధించిన వ్యాధి పరిభాషను ఇండెక్సింగ్ చేయడం ఏకీకృత ప్రపంచ సంప్రదాయాన్ని నిర్మించడంలో ఒక మైలురాయి అని డబ్ల్యూహెచ్ఓ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డిడిఐ డాక్టర్ సమీరా అస్మా అన్నారు. డబ్ల్యూహెచ్ఓ సీనియర్ స్ట్రాటజిక్ అడ్వైజర్ డాక్టర్ శ్యామా కురువిల్లా మాట్లాడుతూ ఐసిడి -11 లో సాంప్రదాయ వైద్య పరిభాషను చేర్చడం వల్ల భారతదేశం సాధారణ ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం అవుతుందని అన్నారు.

ఐసిడి-11లో పొందుపరిచిన డేటా ప్రపంచ ఉపయోగం కోసం అందుబాటులో ఉంటుందని డబ్ల్యూహెచ్ఓ క్లాసిఫికేషన్ అండ్ టెర్మినాలజీ యూనిట్ హెడ్ డాక్టర్ రాబర్ట్ జాకబ్ తెలిపారు.

ఐసిడి -11 లో టిఎమ్ మాడ్యూల్ 2 ను చేర్చడం సాంప్రదాయ వైద్యానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుతో పాటు ఒక ఉద్యమంగా చూడవచ్చని డబ్ల్యూహెచ్ఓ ఇంటిగ్రేటెడ్ హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రూడీ ఎగ్గర్స్ చెప్పారు. ఇందుకోసం 2014 నుంచి 2023 వరకు వ్యూహాన్ని రూపొందించగా, 2025 నుంచి 2034 వరకు డబ్ల్యూహెచ్ వో స్ట్రాటజీ ఫర్ ట్రెడిషనల్ మెడిసిన్ మొదటి ముసాయిదాను సిద్ధం చేశారు.

డబ్ల్యూహెచ్ఓ సభ్య దేశాలైన బ్రెజిల్, బంగ్లాదేశ్, మలేషియా, మారిషస్, శ్రీలంక, నేపాల్, ఇరాన్, బ్రిటన్ ప్రతినిధులు తమ తమ దేశాల్లో సంప్రదాయ వైద్యం ప్రస్తుత స్థితిగతులపై తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూహెచ్ వో, ఆయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు, దాని పరిశోధనా మండళ్లు, జాతీయ విద్యా సంస్థలు, చైర్మన్లు, సంబంధిత అధ్యక్షులు, నేషనల్ కమిషన్ ఫర్ ఇండియా సిస్టమ్ ఆఫ్ మెడిసిన్, నేషనల్ కమిషన్ ఫర్ హోమియోపతి పాల్గొన్నారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్ఓ సభ్య దేశాల ప్రతినిధులు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి కవితా గార్గ్ స్వాగతోపన్యాసం చేశారు.

# షర్మిలకు ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ పదవి ఇవ్వొద్దు : హర్షకుమార్

రాజమండ్రి జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ పదవిని ఇటీవల పార్టీలో చేరిన వైఎస్ షర్మిలకు ఇచ్చే అవకాశం ఉంది. పార్టీలో చేరే సమయంలో హైకమాండ్ పెద్దలు మాట ఇచ్చారని విశ్వసనీయ సమాచారం. షర్మిలకు అధ్యక్ష పదవీ ఇవ్వొద్దని కొందరు నేతలు అంటున్నారు. ఏపీ కాంగ్రెస్‌లో రెబల్, మాజీ ఎంపీ హర్షకుమార్ బహిరంగంగా వ్యతిరేకించారు. 'షర్మిల తెలంగాణకు చెందిన వారు. ఆంధ్రప్రదేశ్‌తో సంబంధం లేదు. ఇక్కడ పార్టీ పగ్గాలు అప్పగించడం సరికాదు. తెలంగాణ కోడలు అయినందున ఏపీ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను ఇవ్వొద్దు' అని హర్షకుమార్ స్పష్టంచేశారు. అతని వ్యాఖ్యల పై ఇతర నేతలు, కాంగ్రెస్ హైకమాండ్ స్పందించాల్సి ఉంది.ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌ను గద్దె దింపేందుకు దళితులు సిద్ధంగా ఉన్నారని హర్షకుమార్ అంటున్నారు. ఫిబ్రవరి 8వ తేదీన రాజమండ్రిలో 'దళిత సింహగర్జన' నిర్వహిస్తున్నామని వివరించారు. వైసీపీ హయాంలో దళితులపై దాడులు ఎక్కువ అయ్యాయని గుర్తుచేశారు. కేసులు నమోదు చేశారని ఒక్కరికి కూడా న్యాయం జరగలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను అమలాపురం లోక్ సభ నుంచి పోటీ చేస్తానని చెబుతున్నారు.ప్రస్తుతం ఏపీ పీసీసీ చీఫ్‌గా గిడుగు రుద్రరాజు ఉన్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏపీలో కాంగ్రెస్ ప్రభావం పూర్తిగా తగ్గింది. ఒక్క అసెంబ్లీ, లోక్ సభ సీటును గెలవలేదు. వచ్చే ఎన్నికల్లో పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ హైకమాండ్ షర్మిలను రంగంలోకి దింపింది. పదవీపై ఇప్పటివరకు ప్రకటన చేయలేదు. పీసీసీ చీఫ్‌గా చేయొద్దని హర్షకుమార్ అంటున్నారు. దీనిపై హైకమాండ్ ఏం ఆలోచన చేయనుందో చూడాలి.

# మాజీ సీఎం ముఫ్తీకి తృటిలో తప్పిన ప్రమాదం

న్యూఢిల్లీ, జనవరి 11:జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ సయ్యద్‌కి తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఇవాళ ఆమె ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. అయితే ఆమె క్షేమంగా ఉన్నట్లు కూతురు ఇల్తిజా మీడియాకు తెలియజేశారు.

ఇవాళ మధ్యాహ్నం అనంత్‌నాగ్ జిల్లా సంఘం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ముఫ్తీ ప్రయాణిస్తున్న బ్లాక్ కలర్ స్కార్పియో వాహనం.. మరో కారును ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమెకు ఏం కాలేదని తెలుస్తోంది. అయితే ఆమెకు భద్రతగా వచ్చిన పోలీస్ సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. ఖానాబాల్ అగ్నిప్రమాదం బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న క్రమంలోనే ఈ ఘటన జరిగింది.

# వైసీపీకి మరో షాక్.. లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరిన సుబ్బారెడ్డి



అమరావతి, జనవరి 11:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తుండడంతో రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. కర్నూలు జిల్లాలో అధికార పార్టీ వైసీపీకి మరో షాక్ తగిలింది. ఇవాళ విజయవాడలో నారా లోకేశ్ సమక్షంలో కర్నూలు వైసీపీ కీలక నేత కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత సుబ్బారెడ్డి టీడీపీలో చేరారు.

ఆయనతో పాటు కుమార్తె కర్నూలు 17వ డివిజన్ కార్పొరేటర్ కైపా పద్మలత రెడ్డి, కుమారుడు అశోక్ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ అశోక్ కుమార్ రెడ్డిలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. లోకేశ్ వారికి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు.

# జీహెచ్ఎంసీకి జాతీయ స్థాయిలో క్లీన్ సిటీ అవార్డు



హైదరాబాద్, జనవరి 11:లక్ష జనాభాకు పైబడిన నగరాల్లో ఆల్ ఇండియా క్లీన్ సిటీ 9వ ర్యాంకును సాధించిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఫైవ్ స్టార్ రేటింగ్ లో స్వచ్ఛ సర్వేక్షణ అవార్డును 2023 సంవత్సరానికి గాను జిహెచ్ఎంసి అందుకుంది.

ఢిల్లీలో భారత మండపం వేదికగా జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హరిదీప్ సింగ్ పూరి చేతుల మీదుగా అవార్డును జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, శానిటేషన్ అడిషనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ సోమ భారత్, సానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ మంజుల అందుకున్నారు.

# వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్ 10వ ఎడిషన్‌లో ప్రధానమంత్రి దార్శనికతను ప్రశంసించిన గ్లోబల్ బిజినెస్ లీడర్లు

న్యూఢిల్లీ, జనవరి 11:వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్ 2024కి సంబంధించిన 10వ ఎడిషన్‌ను గాంధీనగర్‌లోని మహాత్మా మందిర్‌లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సంవత్సరం శిఖరాగ్ర సదస్సుకు ఇతివృత్తం 'గేట్‌వే టు ది ఫ్యూచర్'. దీనిలో 34 భాగస్వామ్య దేశాలు, 16 భాగస్వామ్య సంస్థల పాల్గొంటున్నాయి . ఈశాన్య ప్రాంతాలలో పెట్టుబడి అవకాశాలను ప్రదర్శించడానికి ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ కూడా సమ్మిట్‌ను వేదికగా ఉపయోగిస్తోంది. ఈ సందర్భంగా పలువురు పారిశ్రామిక వేత్తలు ప్రసంగించారు.

శ్రీ లక్ష్మీ మిట్టల్, ఆర్సెలార్ మిట్టల్ చైర్మన్: గత సంవత్సరం సెప్టెంబర్‌లో వైబ్రంట్ గుజరాత్ 20వ వార్షికోత్సవాన్ని సందర్శించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. వైబ్రంట్ గుజరాత్ సమ్మిట్ మెగా గ్లోబల్ ఈవెంట్ కోసం సంస్థాగతమైన ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడానికి ప్రక్రియ కొనసాగింపుపై ప్రధానమంత్రి చెప్పారని ప్రశంసించారు. ప్రతి అంతర్జాతీయ ఫోరమ్‌లో ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు మరియు గ్లోబల్ సౌత్ వాయిస్‌ని బలోపేతం చేసే సూత్రాలపై ప్రధాన మంత్రికి ఉన్న నమ్మకాన్ని కూడా ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. దేశాన్ని స్వయం-ఆధారితంగా మార్చడంలో ఉక్కు ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన శ్రీ మిట్టల్, 2021లో ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా హజీరా విస్తరణ ప్రాజెక్ట్ శంకుస్థాపనను గుర్తుచేసుకున్నారు. ప్రాజెక్ట్ మొదటి దశ 2026 నిర్దేశిత సంవత్సరానికి పూర్తవుతుందని తెలియజేసారు. పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్ వంటి హరిత రంగాలలో పెట్టుబడులు పెట్టడాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

జపాన్‌లోని సుజుకీ మోటార్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ తోషిహిరో సుజుకి: ప్రధానమంత్రి ఒక బలమైన నాయకుడిగా ఘనత సాధించారు. దేశంలోని తయారీ పరిశ్రమలకు అందించిన మద్దతుకు సుజుకి ధన్యవాదాలు తెలిపారు. భారతదేశం ఇప్పుడు ప్రపంచంలోనే 3వ అతిపెద్ద ఆటోమొబైల్ మార్కెట్‌గా అవతరించిందని పేర్కొంటూ, దేశ ఆర్థిక వృద్ధిపై ప్రధానమంత్రి ప్రగతిశీల విధానం ప్రభావాన్ని సుజుకి ప్రముఖంగా ప్రస్తావించారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నాలను నొక్కిచెప్పడంతో, భారతదేశంలో ఉత్పత్తి చేయబడిన మొదటి ఈవీని యూరోపియన్ దేశాలకు, జపాన్‌కు ఎగుమతి చేసే కంపెనీ ప్రణాళికలను కూడా ఆయన స్పృశించారు. ఇథనాల్, గ్రీన్ హైడ్రోజన్, ఆవు పేడ నుండి బయోగ్యాస్ ఉత్పత్తి ద్వారా గ్రీన్హౌస్ ఉద్గారాలను తగ్గించడానికి సంస్థ ప్రణాళికను కూడా ఆయన ప్రస్తావించారు.

రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన శ్రీ ముఖేష్ అంబానీ: వైబ్రంట్ గుజరాత్‌ను ఈ రోజు ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన పెట్టుబడి శిఖరాగ్ర సదస్సు గా అభివర్ణించారు, ఎందుకంటే ఈ రకమైన మరే ఇతర శిఖరాగ్ర సమావేశం 20 సంవత్సరాలుగా జరగలేదు. "ఇది మన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత, స్థిరత్వానికి నివాళి" అని ఆయన అన్నారు. వైబ్రంట్ గుజరాత్ ప్రతి ఎడిషన్‌లో తాను పాల్గొన్నట్లు ఆయన తెలియజేశారు. గుజరాతీ మూలాల పట్ల గర్వపడుతున్నానని అంటూ.. శ్రీ అంబానీ గుజరాత్‌ను మార్చినందుకు ప్రధానమంత్రిని ప్రశంసించారు.. "ఈ పరివర్తనకు ప్రధాన కారణం ఆధునిక కాలంలో గొప్ప నాయకుడిగా, భారతదేశ చరిత్రలో అత్యంత విజయవంతమైన ప్రధానమంత్రిగా శ్రీ నరేంద్ర మోదీ- ఎదిగిన మన నాయకుడు. ప్రపంచం మాట్లాడడమే కాదు, చప్పట్లు కొడుతుంది. భారత ప్రధాని అసాధ్యాన్ని ఎలా సుసాధ్యం చేశారనే దానిపై ఆయన విశదీకరించారు - 'మోదీ హై తో ముమ్కిన్ హై' ఈ నినాదం ప్రపంచ ప్రేక్షకులలో ప్రతిధ్వనిస్తోంది. శ్రీ ముఖేష్ అంబానీ తన తండ్రి ధీరూభాయ్‌ని గుర్తు చేసుకుంటూ రిలయన్స్ ఎప్పటికీ గుజరాతీ కంపెనీగానే ఉంటుందని అన్నారు. "ప్రతి రిలయన్స్ వ్యాపారం నా 7 కోట్ల మంది తోటి గుజరాతీల కలలను నెరవేర్చడానికి కృషి చేస్తోంది" అని ఆయన అన్నారు. రిలయన్స్ గత 10 సంవత్సరాలలో ప్రపంచ స్థాయి ఆస్తులను సృష్టించడానికి భారతదేశం అంతటా 150 బిలియన్ యుఎస్ డాలర్లు అంటే 12 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టిందని, ఇందులో మూడింట ఒక వంతు గుజరాత్‌లోనే పెట్టుబడి పెట్టారని ఆయన తెలియజేశారు. శ్రీ అంబానీ గుజరాత్‌కు 5 ప్రతిజ్ఞలు చేశారు. మొదటిది, రాబోయే 10 సంవత్సరాలలో గణనీయమైన పెట్టుబడులతో గుజరాత్ వృద్ధి కథలో రిలయన్స్ ప్రముఖ పాత్ర పోషిస్తుంది, ప్రత్యేకంగా, గ్రీన్ గ్రోత్‌లో గుజరాత్‌ను ప్రపంచ నాయకుడిగా మార్చడంలో రిలయన్స్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. "2030 నాటికి పునరుత్పాదక ఇంధనం ద్వారా గుజరాత్ సగం శక్తి అవసరాలను తీర్చడానికి మేము సహాయం చేస్తాము" అని ముఖేష్ అంబానీ అన్నారు. జామ్‌నగర్‌లో 5000 ఎకరాల విస్తీర్ణంలో ధీరూభాయ్ ఎనర్జీ గిగా కాంప్లెక్స్ రాబోతోంది, ఇది 2024 ద్వితీయార్థంలో ప్రారంభించ బడుతుందని ఆయన తెలిపారు. రెండవది, 5జీ అత్యంత వేగంగా రోల్ అవుట్ అయినందున, నేడు గుజరాత్ పూర్తిగా 5జీ ప్రారంభం అయింది. ఇది డిజిటల్ డేటా ప్లాట్‌ఫారమ్‌లో, ఏఐ స్వీకరణలో గుజరాత్‌ను అగ్రగామిగా చేస్తుంది. నాణ్యమైన ఉత్పత్తులను తీసుకురావడానికి, లక్షలాది మంది రైతులు, చిన్న వ్యాపారులకు సహాయం చేయడానికి మూడవ రిలయన్స్ రిటైల్ తన పాదముద్రను విస్తరిస్తుంది. నాల్గవది, రిలయన్స్ గుజరాత్‌ను కొత్త మెటీరియల్స్, సర్క్యులర్ ఎకానమీలో అగ్రగామిగా మారుస్తుందని ఆయన అన్నారు. గ్రూప్ హజీరాలో ప్రపంచ స్థాయి కార్బన్ ఫైబర్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తోంది. 2036 ఒలింపిక్స్‌కు వేలం వేయాలనే ఉద్దేశంతో ప్రధాని చేసిన ప్రకటనకు అనుగుణంగా, గుజరాత్‌లో క్రీడలు, విద్య మరియు నైపుణ్యాల మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి రిలయన్స్, రిలయన్స్ ఫౌండేషన్ అనేక ఇతర భాగస్వాములతో కలిసి పనిచేస్తాయని ఆయన చెప్పారు. 'భారతదేశ అభివృద్ధికి గుజరాత్ అభివృద్ధి' అని అంబానీ చెప్పారు. ఇప్పుడు 'ప్రధానమంత్రిగా మీ మిషన్ ప్రపంచ వృద్ధికి భారతదేశ అభివృద్ధి అని చెప్పారని శ్రీ అంబానీ గుర్తు చేసుకున్నారు. మీరు గ్లోబల్ గుడ్ అనే మంత్రంపై పని చేస్తున్నారు మరియు భారతదేశాన్ని ప్రపంచ వృద్ధి ఇంజిన్‌గా చేస్తున్నారు. కేవలం రెండు దశాబ్దాల్లో గుజరాత్ నుంచి ప్రపంచ స్థాయికి చేరుకున్న మీ ప్రయాణం ఆధునిక ఇతిహాసం కంటే తక్కువ కాదు' అని ఆయన అన్నారు. "యువ తరానికి ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశించడానికి, ఆవిష్కరణలు చేయడానికి మరియు 100 మిలియన్ల మందికి సులభంగా జీవించడానికి మరియు సులభంగా సంపాదించడానికి నేటి భారతదేశం ఉత్తమ సమయం అని ఆయన అన్నారు. జాతీయవాది, అంతర్జాతీయవాది అయినందుకు రాబోయే తరాలు ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతాయి. వికసిత భారత్‌కు గట్టి పునాది వేశారు. 2047 నాటికి భారతదేశం 35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారకుండా భూమిపై ఉన్న ఏ శక్తీ అడ్డుకోలేదని ఆయన చెప్పారు. గుజరాత్ ఒక్కటే 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడాన్ని నేను చూస్తున్నాను. మోదీ శకం భారతదేశాన్ని శ్రేయస్సు, పురోగతి, కీర్తి కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రతి గుజరాతీ, ప్రతి భారతీయుడు విశ్వసిస్తున్నాడు అని వారి అంబానీ తెలిపారు.

సెమీకండక్టర్ల తయారీకి దేశాన్ని తెరవాలనే ఉద్దేశ్యంతో ప్రధాన మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన మైక్రోన్ టెక్నాలజీస్, అమెరికా సీఈఓ శ్రీ సంజయ్ మెహ్రోత్రా, భవిష్యత్తులో భారతదేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే క్రమంలో ఇది ఒక భారీ ఆర్థిక చోదకశక్తిగా మారుతుందని అన్నారు. వైబ్రంట్ గుజరాత్ సమ్మిట్ సెమీకండక్టర్ శక్తిగా భారతదేశం ఎదుగుదలకు కీలకమైన దార్శనిక ఆలోచనలను ప్రస్తావిస్తుంది. ఈ రంగంలో బహుళ వృద్ధి అవకాశాలపై కూడా వెలుగునిచ్చింది. గుజరాత్‌లో ప్రపంచ స్థాయి మెమరీ అసెంబ్లీ మరియు టెస్ట్ సదుపాయాన్ని ఏర్పాటు చేయడంలో సహాయం చేసినందుకు రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు, ఈ సౌకర్యం కోసం టాటా ప్రాజెక్ట్‌లతో మౌలిక సదుపాయాల భాగస్వామ్యాన్ని ప్రస్తావించారు. 500,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో మొదటి దశ 2025 ప్రారంభంలో అమలులోకి వస్తుందని, తద్వారా రాబోయే సంవత్సరాల్లో 5,000 ప్రత్యక్ష ఉద్యోగాలు మరియు 15,000 అదనపు కమ్యూనిటీ ఉద్యోగాలు సృష్టించబడతాయని ఆయన తెలియజేశారు. "మైక్రాన్ మరియు ప్రభుత్వం రెండు దశల్లో కలిపి పెట్టుబడి 2.75 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకోగలవు" అని ఆయన చెప్పారు. సెమీకండక్టర్ పరిశ్రమలో భారతదేశంలో పెట్టుబడులను పెంచడంలో యాంకర్‌గా వ్యవహరించడంలో కంపెనీ పాత్రను ఆయన వివరించారు.

ఇప్పటి వరకు జరిగిన వైబ్రంట్ గుజరాత్ సమ్మిట్‌లో ప్రతి ఎడిషన్‌లో భాగమైనందుకు సగర్వంగా భావిస్తున్నట్టు అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ అన్నారు. ఆయన అసాధారణమైన దృక్పథానికి ప్రధానికి కృతజ్ఞతలు తెలిపిన సందర్భంగా, అదానీ తన హాల్‌మార్క్ సంతకాలు, గొప్ప ఆశయాలు, ఖచ్చితమైన పాలన, దోషరహిత అమలును ప్రశంసించారు. భారతదేశం పారిశ్రామిక ప్రకృతి దృశ్యాన్ని ప్రాథమికంగా పునర్నిర్మించడానికి రాష్ట్రాలు పోటీపడుతూ, సహకరించుకుంటూ ముందుకు సాగుతున్నప్పుడు దేశవ్యాప్త ఒక ఉద్యమ స్ఫూర్తిని రేకెత్తించిన ప్రధానమంత్రిని ప్రశంసించారు. 2014 నుండి, భారతదేశ జిడిపి 185 శాతం, తలసరి ఆదాయం 165 శాతం పెరిగింది, ప్రత్యేకించి భౌగోళిక రాజకీయ అస్థిరత, మహమ్మారి సవాళ్లతో గుర్తించబడిన యుగంలో ఇది గొప్పదని ఆయన నొక్కిచెప్పారు. గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌లపై తన స్వరాన్ని వినిపించాలని కోరుకునే దేశం నుండి ఇప్పుడు గ్లోబల్ ప్లాట్‌ఫారమ్‌లను సృష్టించే దేశానికి దేశం ప్రయాణాన్ని హైలైట్ చేస్తూ అంతర్జాతీయ వేదికపై ప్రధానమంత్రి సాధించిన విజయాలను ఆయన ప్రశంసించారు. భారతదేశం జీ20 ప్రెసిడెన్సీ సమయంలో ప్రధానమంత్రి నాయకత్వం, జీ20కి గ్లోబల్ సౌత్‌ను చేర్చడం గురించి ప్రస్తావిస్తూ, అదానీ ఇది మరింత సమగ్ర ప్రపంచ క్రమంలో బెంచ్‌మార్క్‌లను నిర్దేశించిందని అన్నారు. ఇది భారతదేశ చరిత్రలో ఒక అద్భుతమైన క్షణం అని అన్నారు. "భవిష్యత్తును మీరు అంచనా వేయరు, మీరు దానిని మలచుకుంటారు", భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా మార్చడానికి, వసుధైవ కుటుంబ తత్వాల ద్వారా దేశాన్ని విశ్వ గురువుగా ప్రపంచ సామాజిక ఛాంపియన్‌గా నిలిపినందుకు ప్రధానమంత్రికి ఘనతగా అదానీ అన్నారు. 2047 నాటికి భారత్‌ను 'వికసిత భారత్'గా మార్చాలన్న ప్రధానమంత్రి దార్శనికత కారణంగా నేటి భారతదేశం రేపటి ప్రపంచ భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు సిద్ధంగా ఉందని, 2025 నాటికి రాష్ట్రంలో రూ.55,000 కోట్ల పెట్టుబడులు పెడతామని ఆయన ప్రకటించారు. 25,000 ప్రత్యక్ష మరియు పరోక్ష ఉద్యోగాలను సృష్టించే వివిధ రంగాలలో రూ. 50,000 కోట్ల పెట్టుబడుల లక్ష్యం. ఆత్మనిర్భర్ భారత్ కోసం హరిత సరఫరా గొలుసు వైపు విస్తరించడం మరియు సోలార్ ప్యానెల్లు, విండ్ టర్బైన్లు, హైడ్రో ఎలక్ట్రోలైజర్లు, గ్రీన్ అమ్మోనియా, పీవీసీ, కాపర్, సిమెంట్ ప్రాజెక్టులలో విస్తరణతో సహా అతిపెద్ద సమగ్ర పునరుత్పాదక ఇంధన పర్యావరణ వ్యవస్థను సృష్టించడం గురించి కూడా ఆయన స్పృశించారు. గుజరాత్‌లో వచ్చే ఐదేళ్లలో రూ. 2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడి పెట్టాలని, తద్వారా లక్షకుపైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు కల్పించాలని అదానీ గ్రూప్ ప్లాన్‌ని ఆయన తెలియజేశారు.

దక్షిణ కొరియా సిమ్ టెక్ సీఈఓ జెఫ్రీ చున్, మాట్లాడుతూ, సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్ట్ సౌకర్యాలలో కీలకమైన సరఫరా గొలుసు భాగస్వామిగా గుజరాత్ రాష్ట్రంలోని తమ ప్రధాన కస్టమర్ మైక్రోన్ ప్రాజెక్ట్ తర్వాత సహ-స్థాన పెట్టుబడిగా తమ భారతదేశ ప్రాజెక్ట్ కోసం ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. భారతదేశం వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంలో కొత్త సరఫరా గొలుసు నెట్‌వర్క్‌ను రూపొందించే ప్రపంచ ఉద్యమాన్ని వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్ ప్రదర్శిస్తుం దని ఆయన అన్నారు. వారు భారతదేశంలో మరో రౌండ్ పెట్టుబడి పెట్టడానికి సిద్ధమవుతున్నారని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ మద్దతును గుర్తించామని ఆయన తెలియజేశారు. ఇది సెమీకండక్టర్ సప్లై చైన్ నెట్‌వర్క్‌లో భారతదేశ ఉనికిని మరింత పటిష్టం చేస్తుందని అన్నారు. .

టాటా సన్స్ లిమిటెడ్ చైర్మన్ శ్రీ ఎన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ, 'ఇంత కాలం పాటు గుజరాత్ స్థిరంగా, అద్భుతమైన పురోగతి సాధించడం, మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జీ దూరదృష్టితో కూడిన నాయకత్వాన్ని, మనస్తత్వాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది'' అని అన్నారు. ఆర్థికాభివృద్ధి కూడా విపరీతమైన సామాజిక అభివృద్ధికి దారితీసిందని, గుజరాత్ భవిష్యత్తుకు గేట్‌వేగా స్పష్టంగా స్థిరపడిందని ఆయన నొక్కి చెప్పారు. వ్యవస్థాపకుడు జంషెడ్‌జీ టాటా నవ్‌సారిలో జన్మించినందున గుజరాత్‌లోని టాటా గ్రూప్ మూలాన్ని ఆయన హైలైట్ చేశారు. నేడు రాష్ట్రంలో 21 టాటా గ్రూప్ కంపెనీలు బలమైన ఉనికిని కలిగి ఉన్నాయి. గుజరాత్‌లో ఈవీ వాహనాలు, బ్యాటరీ ఉత్పత్తి, సి295 డిఫెన్స్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, సెమీకండక్టర్ ఫ్యాబ్, అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కిల్ బిల్డింగ్ రంగాలలో గ్రూప్ విస్తరణ ప్రణాళికను కూడా ఆయన వివరించారు. "టాటా గ్రూప్‌కు అత్యంత ముఖ్యమైన గమ్యస్థానాలలో గుజరాత్ ఒకటి, దాని అభివృద్ధి ప్రయాణంలో మేము కీలక పాత్ర పోషిస్తాము" అని ఆయన అన్నారు.

డిపి వరల్డ్ ఛైర్మన్, సుల్తాన్ అహ్మద్ బిన్ సులేయం మాట్లాడుతూ, సమ్మిట్‌ను నిర్వహించినందుకు గుజరాత్ ప్రభుత్వాన్ని అభినందించారు. శక్తివంతమైన గుజరాత్ కోసం ప్రధానమంత్రి దృష్టి సాకారం కావడం సంతోషదాయకమని అన్నారు. 'వికసిత భారత్ ఏ 2047' అనే ప్రధాన మంత్రి దార్శనికత ద్వారా మార్గనిర్దేశం చేయబడిన భారతదేశపు ప్రధాన వ్యాపార వేదికగా వైబ్రంట్ గుజరాత్ సమ్మిట్ దాని విపరీతమైన పెరుగుదలను ప్రదర్శిస్తుందని ఆయన అన్నారు. గిఫ్ట్ సిటీ, ధోలేరా స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్, గుజరాత్ మారిటైమ్ క్లస్టర్ వంటి వివిధ పారిశ్రామిక క్లస్టర్‌లను అభివృద్ధి చేసి ప్రోత్సహించినందుకు ప్రభుత్వం ఘనత పొందిందని, ఇది భవిష్యత్తుకు గేట్‌వేగా పనిచేస్తుందని అన్నారు. భారతదేశం, యూఏఈ మధ్య ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలపై వెలుగునిస్తూ, 2017 నుండి 2.4 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టిన గుజరాత్‌లో అతిపెద్ద విదేశీ పెట్టుబడిదారులలో దేశం ఒకటిగా ఉందని ఆయన తెలియజేశారు. గుజరాత్ చివరిగా 7 బిలియన్ అమెరికన్ డాలర్ల కంటే ఎక్కువ విలువైన వస్తువులను ఎగుమతి చేసిందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారతదేశం ఉందని పేర్కొంటూ, ప్రధానమంత్రి బలమైన నాయకత్వంలో వృద్ధి కొనసాగుతుందని సులేయం ఉద్ఘాటించారు. భారతదేశం మరియు గుజరాత్ ఆర్థిక శక్తి కేంద్రాలుగా తమ సామర్థ్యాన్ని గుర్తించడంలో సహాయపడే గతిశక్తి వంటి పెట్టుబడి కార్యక్రమాలకు కూడా ఆయన ప్రశంసించారు. గుజరాతలోని కాండ్లాలో 2 మిలియన్ కంటైనర్ల సామర్థ్యంతో అత్యాధునిక కంటైనర్ టెర్మినల్స్‌ను పెట్టుబడి పెట్టడానికి మరియు అభివృద్ధి చేయడానికి డీపీ వరల్డ్ ప్రణాళిక గురించి ఆయన తెలియజేశారు. దేశం లాజిస్టిక్స్ అవస్థాపనను విస్తరించడంలో భారత ప్రభుత్వంతో భాగస్వామ్యం కావడం పట్ల ఆయన గర్విస్తున్నారని, వైబ్రంట్ గుజరాత్ సమ్మిట్‌లో భాగమయ్యే అవకాశం కల్పించిన ందుకు గుజరాత్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

నివిడియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, శ్రీ శంకర్ త్రివేదిమాట్లాడుతూ జనరేటివ్ ఏఐ పెరుగుతున్న ప్రాముఖ్యతను గమనిస్తూ, భారత ప్రభుత్వ సీనియర్ సభ్యులకు నాయకులకు ఉపన్యాసం ఇవ్వడానికి నివిడియా సీఈఓ జెన్సన్ హువాంగ్‌ను పిఎం మోదీ ఆహ్వానించారని, "ఇది మొదటిది" అని అన్నారు. ఒక ప్రపంచ నాయకుడు నిజానికి ఏఐ గురించి ఆలోచించినందుకు ప్రధాని మోదీజీ నాయకత్వానికి ధన్యవాదాలు అని అన్నారు. ఇది భారతదేశంలో, ఇక్కడ గుజరాత్‌లో కూడా ఉత్పాదక ఏఐ ని స్వీకరించడానికి ఉత్ప్రేరకంగా ఉంది. ఉత్పాదక ఏఐ కి సంబంధించి స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఎన్‌విడియా చేస్తున్న ప్రయత్నాలను వివరిస్తూ, 'భారతదేశంలో ప్రతిభ, స్థాయి, అద్భుతమైన డేటా, విశిష్ట సంస్కృతి ఉంది'' అని అన్నారు. మేక్ ఇన్ ఇండియాకు ఎన్విడియా మద్దతును కూడా ఆయన నొక్కి చెప్పారు.

జెరోడాక వ్యవస్థాపకుడు, సీఈఓ నిఖిల్ కామత్, ఒక వ్యవస్థాపకుడిగా తన ప్రయాణానికి సారూప్యతను చూపుతూ గత రెండు దశాబ్దాలుగా దేశం మొత్తం అభివృద్ధిపై ప్రస్తావించారు. 10 ఏళ్ల క్రితం లేని విధంగా దేశంలోని స్టార్టప్ ఎకోసిస్టమ్, చిన్న పారిశ్రామికవేత్తలు, ఈకామర్స్ ఎదుగుదలను తాను ప్రశంసించినందున గత 10 సంవత్సరాలు నమ్మశక్యం కానివని ఆయన వ్యాఖ్యానించారు. స్టార్టప్‌లు అభివృద్ధి చెందేందుకు వీలుగా స్థిరమైన పర్యావరణ వ్యవస్థను సులభతరం చేసినందుకు ప్రధానిని ఆయన ప్రశంసించారు.

## దేశీయ మార్కెట్‌లో సమృద్ధిగా బొగ్గు సరఫరా తగ్గుతున్న బొగ్గు ధర సూచీలో ఫలితాలు

న్యూఢిల్లీ, జనవరి 11:దిగుమతి ధరలు, వేలం ధరలు, నోటిఫైడ్ ధరలు సహా అన్ని విక్రయ మార్గాల నుంచి వచ్చే బొగ్గు ధరలన్నింటినీ మిళితం చేసే ధరల సూచీ జాతీయ బొగ్గు సూచీ (ఎన్‌సిఐ). ఆర్థిక సంవత్సరం 2017-18 మూల సంవత్సరంగా ఏర్పాటైన ఈ సూచీ మార్కెట్ గతిశీలతను విశ్వసనీయ సూచికగా పని చేయడమే కాక, ధరల హెచ్చు తగ్గులపై విలువైన అంతర్దృష్టులను అందిస్తుంది. జాతీయ బొగ్గు సూచీ నవంబర్ 2022తో పోలిస్తే నవంబర్ 2023లో 155.09 పాయింట్ల వద్ద 17.54% గణనీయమైన క్షీణతను నుంచి చూపి 188.08 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇది పెరుగుతున్న డిమాండ్లను నెరవేర్చడంలో తగినంత లభ్యతతో మార్కెట్‌లో బలమైన బొగ్గు సరఫరాను సూచిస్తుంది.

అదే విధంగా, కోకింగ్ బొగ్గు నవంబర్ 2023లో 143.52 పాయింట్ల వద్ద నిలిచింది. ఇది నవంబర్ 2022తో పోలిస్తే 25.07% క్షీణతను ప్రతిఫలిస్తుంది. అయితే, కోకింగ్ కోల్ నవంబర్‌లో 188.39 పాయింట్ల వద్ద ఉండి, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 5.79% వృద్ధిని సాధించింది.

జూన్ 2022లో ఈ సూచీ 238.83 పాయింట్లకు చేరుకోవడాన్ని గమనించడం జరిగింది. కానీ అనంతర నెలల్లో క్షీణతను చవిచూసింది. ఇది భారత మార్కెట్‌లో బొగ్గు సమృద్ధిగా ఉండడాన్ని సూచిస్తుంది.

అదనంగా, బొగ్గు వేలం మీద ప్రీమియం పరిశ్రమ స్పందనను సూచిస్తుంది. బొగ్గు వేలం ప్రీమియం గణనీయంగా తగ్గడం మార్కెట్‌లో తగినంత బొగ్గు లభ్యతను నిర్ధారిస్తుంది. భారతదేశపు బొగ్గు కంపెనీలు ఆకట్టుకునే నిల్వలను కలిగి ఉండి, పరిశ్రమలో గణనీయమైన నిల్వను ధృవీకరిస్తుంది. ఈ లభ్యత బొగ్గుపై ఆధారపడిన వివిధ రంగాలకు స్థిరమైన సరఫరాను నిర్ధారించడం ద్వారా యావత్ దేశపు ఇంధన భద్రతకు గణనీయంగా దోహదం చేస్తుంది.

జాతీయ బొగ్గు సూచీ అధోముఖ ధోరణి అన్నది మరింత సమతుల్య మార్కెట్‌ను సూచిస్తూ, సరఫరా, డిమాండ్‌ను సమలేఖనం చేస్తుంది. తగినంత బొగ్గు లభ్యతతో, దేశంలో పెరుగుతున్న డిమాండ్లను తీర్చడమే కాకుండా దాని దీర్ఘకాలిక ఇంధన అవసరాలకు తోడ్పాటునిస్తుంది. తద్వారా మరింత స్థితిస్థాపకంగా స్థిరమైన బొగ్గు పరిశ్రమను నిర్మించి, దేశానికి సంపన్నమైన భవిష్యత్తుకు హామీ ఇచ్చి, భద్రతపరుస్తుంది.

# అనాథలకు ఆరాధ్యుడు డా.హరి ఇప్పనపల్లి



హైదరాబాద్ జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ప్రపంచ పర్యావరణ పరిరక్షణ సంస్థ ముఖ్య సలహాదారులు ప్రముఖ మానవతావాది అమెరికా కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా వందకు పైచిలుకు దేశాలలో అనేక సామాజిక పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేస్తూ భారత మాజీ రాష్ట్రపతి భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాల సాధన కోసం ఆయన చూపిన మార్గంలో ప్రయాణిస్తూ తను పుట్టిన మాతృభూమికి సేవ చేయాలన్న ఏకైక సంకల్పంతో ముఖ్యంగా యువతకు ఉజ్వలమైన భవిష్యత్తు అందించినప్పుడే దేశానికి సమర్థవంతమైన నాయకత్వం అందుతుందని కృషి చేస్తున్న మనవతామూర్తి డాక్టర్ హరి ఇప్పనపల్లి.గ్లోబల్ లీడ్ ఫౌండేషన్ స్థాపించి కరోనా కష్టకాలంలో అనాథ శవాలకు అంత్యక్రియలు చేయడం కోసం నాలుగు కొత్త అంబులెన్స్ దానం చేసి దహన సంస్కారాలకు కావలసినటువంటి అన్ని రకాల వస్తువులను అమెరికా నుంచి ఇండియాకు పంపించి ఎన్నోఅనాథ శవాలకు గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు నిర్వహించిన నాయకుడు డాక్టర్ హరి ఇప్పనపల్లి. యువత పోటీ ప్రపంచంలో అగ్రస్థానంలో నిలవాలని అనేక విశ్వవిద్యాలయాలలో, కాలేజీలలో ఉన్న సాంకేతిక పోటీ ప్రపంచంతో యువతను చైతన్యం చేస్తూ వారికి అంతర్జాతీయ స్థాయి టెక్నికల్ స్కిల్స్ వృత్తి నైపుణ్యాలను అందించడానికి నిష్ణాతులైన మేధావులతో కలిసి నిరంతరం ప్రోత్సహిస్తూ యువతను వ ం ం ద ్ ం క ్ ం నడిపిస్తున్నారు.భారతదేశంలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ సంస్థ జాతీయ అధ్యక్షులు అధ్యక్షులు డా"సీ హెచ్ భద్ర ఆహ్వానం మేరకు భారతదేశానికి వచ్చి పర్యటనలో భాగంగా హైదరాబాద్ నగరంలోని జీవోదయ ఆశ్రమంను సందర్శించడం జరిగింది. తన స్నేహితుడు గురువు అయిన హరికి భద్ర ఆశ్రమంలోని అనాథ బిడ్డల అవసరాల గురించి వివరించడం జరిగింది.దానిలో భాగంగా కరోనా సమయంలో సరైన విద్య అందడంలేదని తెలిసి 36 మంది అనాథ బిడ్డలకు అత్యుత్తమ విద్యాసంస్థలలో ఉన్నతమైన ఇంగ్లీషు మీడియంతో కూడిన విద్యను అందించి పిల్లల భవిష్యత్తుకు పూల బాటలు వేయాలని నిర్ణయించుకుని హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలో గల వివేకానంద హై స్కూల్లో ఉచిత విద్యతో పాటు దుస్తులు, పుస్తకాలు కావలిసిన అన్ని సౌకర్యాలు తన సొంత ఖర్చుతో అందించడం జరుగుతుంది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రపంచ పర్యావరణ సంస్థ బృందం డాక్టర్ హరి ఇప్పనపల్లికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా హరి ఇప్పన్నపల్లి మాట్లాడుతూ ఈ రోజు నుంచి ఈ బిడ్డలు నా సొంత బిడ్డలని వారు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగడానికి ప్రపంచ స్థాయిలో విద్య నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి నా వంతు మన సంస్థల ప్రోత్సాహం ఎప్పుడు ఉంటుందని భవిష్యత్తులో మరింత మంది బిడ్డలను చదివించడానికి వారిని అంతర్జాతీయ వేదికల మీద నిలబెట్టడానికి నా జీవితాన్ని వారికి అంకితం చేస్తానని వాగ్దానం చేశారు.విద్యార్థులు బాగా చదువుకొని పర్యావరణ పరిరక్షణ మహా ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ సంస్థ ఏ కార్యక్రమం చేపట్టిన సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం, అందరికీ నాణ్యమైన విద్య అందించాలని ప్రజలకు ఆరోగ్యవంతమైన పర్యావరణాన్ని ఇవ్వాలని ఏకైక లక్ష్యంతో గత పది సంవత్సరాలుగా భారతదేశంలో పనిచేస్తుందని తెలియజేశారు. ఢిల్లీ నుండి గల్లీ దాకా పర్యావరణ పరిరక్షణ మహా ఉద్యమాన్ని చేపట్టి భవిష్యత్తులో మరిన్ని పర్యావరణ పరిరక్షణ అవగాహన సదస్సులు విద్యార్థులకు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ బృందం హెల్త్ డైరెక్టర్ బానోతు హీరాలాల్, ట్యాక్స్ ఫైలింగ్ ఇండియా సీఈవో చెల్లూరి శ్రీనివాస్, ఎండి పూలన్ దేవి, షిప్ ఎన్జీవో సమస్త ఫౌండర్ జి నిర్మల, గ్లోబల్ లీడ్ ఫౌండేషన్ ఇండియా ప్రెసిడెంట్ రామ్ రెడ్డి, సమస్త ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ప్రపంచ పర్యావరణ సంస్థ ప్రధాన కార్యదర్శి నిఖిల్, సహాయ కార్యదర్శి ఏ రాజేష్ గౌడ్ మరియు మధుబాబు ఉపాధ్యక్షులు ప్రశాంత్ కేంద్ర ప్రభుత్వ ఆహార పంపిణీ సలహా మండలి సభ్యులు రిజ్వాన్ కళా రాజ్ మీడియా సంస్థ ఎండి మర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత బంధును వెంటనే విడుదల చేయాలి.. కలెక్టరేట్ ఎదుట ఆందోళన



నిజామాబాద్, జనవరి 11: ఎన్నికల అనంతరం ఆల్గోయింగ్ స్కీమ్ క్రింది లబ్దిదారులకు మంజూరైన ధళిత బంధును వెంటనే విడుదల చేసి దళిత కుటుంబాల ఆర్థిక అభ్యున్నతికి తోడ్పడాలని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని జిల్లా కలెక్టరేట్ ఎదుట అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో దళితబంధు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా యువజన సంఘం నాయకులు మాట్లాడుతూ? దళితుల అభ్యున్నతికి ప్రతీ ఒక్క దళిత కుటుంబం ఆర్థిక పరంగా, వ్యాపార పరంగా అభివృద్ధి చెందాలనే సదుద్దేశంతో దళితబంధు పథకం ద్వారా మొదటి దశలో అనేక దళిత పేద కుటుంబాలను ఆదుకోవడం జరిగిందన్నారు. రెండవ దశ దళిత బంధు జిల్లా వ్యాప్తంగా దళిత కుటుంబాలు లబ్దిదారులుగా ఎంపికై బ్యాంకు ఖాతాలు వెరిఫికేషన్ తో పాటు కాగితాల వెరిఫికేషన్ కూడా పూర్తయిందని పేర్కొన్నారు. కానీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో తాత్కాలికంగా దళితబంధు నిలిపివేయడం జరిగిందని వాపోయారు. దళిత బంధును వెంటనే విడుదల చేసి దళిత కుటుంబాల ఆర్థిక అభ్యున్నతికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీవన్, గంగన్న, రమేష్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి కుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి..

అమరావతి, జనవరి 11:సంక్రాంతి సెలవులు ఆ కుటుంబంలో విషాదాన్ని నింపాయి. సెలవుల కారణంగా ఆడుకునేందుకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు నీటి కుంటలో పడి మృతిచెందిన ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం పాత గోళ్లవిడిపి గ్రామంలో చోటుచేసుకుంది.

ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి నార్నపాటి శివాంజి (8), నార్నపాటి సాయి (10) అనే చిన్నారులు మృతిచెందారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో నీటి గుంట దగ్గరకు వెళ్లి ఆడుకునే సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుందని సమాచారం. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మృతదేహాలను చూసి భోరున విలపించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# కాంగ్రెస్ అబద్దాల ముందు కెసిఆర్ అభివృద్ధి ఓడిపోయింది- కెటిఆర్



హైదరాబాద్, జనవరి 11:కాంగ్రెస్ పార్టీ అబద్ధాల ముందు కెసిఆర్ చేసిన అభివృద్ధి ఓడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ . పనుల మీద కంటే ప్రచారం మీద ఫోకస్ చేసి ఉంటే బీఆర్ఎస్ గెలిచేదని అన్నారు. తెలంగాణ భవన్ లో నేడు జరిగిన మహబూబాద్ పార్లమెంట్ నియోజకర్గ సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ. వందలాది సంక్షేమ కార్యక్రమాలు మన ప్రభుత్వ హయాంలో అమలు చేసినా, ఏనాడు కూడా ప్రజలను లైన్లలో నిలబెట్టలేదని స్పష్టం చేశారు. ప్రజల సౌకర్యమే చూసామే కానీ రాజకీయ ప్రయోజనం, రాజకీయ ప్రచారమే గురించి ఏనాడు ఆలోచించలేదని అన్నారు. ప్రజలు బీఆర్ఎస్ ను పూర్తిగా తిరస్కరించలేదని అన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి మూడో వంతు సీట్లు 39 వచ్చాయి. 14 స్థానాల్లో ఓటమి కేవలం గరిష్టంగా 6 వేల ఓట్ల తోనే జరిగింది. మొత్తంగా కాంగ్రెస్ మనకు తేడా కేవలం 1.85 శాతం అన్నారు. పార్టీ సమావేశాలను వరుసగా పెట్టుకుంటామని అన్నారు. అనుబంధ సంఘాలను బలోపేతం చేస్తామని తెలిపారు. పార్టీకి అన్ని వర్గాలను దగ్గరయ్యేలా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. గిరిజనులకు స్థానిక సంస్థల రిజర్వేషన్ తో పాటు.. పోడు భూముల పట్టాల పంపిణీ, అనేక ఇతర సంక్షేమ పథకాలు అనేక కార్యక్రమాలను మన ప్రభుత్వం గతంలో అందించిందన్నారు. అయినా గిరిజనం ఎక్కువ ఉన్న చోట్లకూడా ప్రజలు పూర్తి మద్దతు మనకివ్వలేదని అంటూ ఇలాంటి వాటన్నింటి సమీక్ష చేసుకుని ముందుకుపోతామన్నారు.

### కాంగ్రెస్ లో ఎవరికి వారే యమునా తీరే - కడియం ..

ఇక మహబూబాబాద్ లోకసభ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి , ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ లో ఎవరికి వారే యమునా తీరే అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ 420 హామీలు నెరవేర్చే పరిస్థితి ఉండదని సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ ,హరీష్ రావు లు కృష్ణార్జునులు వారు కలిసికట్టుగా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని కోరారు. కార్యకర్తలకు అగ్రనాయకత్వం అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు హరీష్ రావు,, వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి , మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్, ఎంపి కవిత మాలోత్ , మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, మాజీ చైర్మన్లు, మేయర్లు, మాజీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు పాల్గొన్నారు.

# ఒక్కసారి కాంగ్రెస్ కు అవకాశం ఇవ్వండి.. ప్రత్యేక హోదా ఇస్తాం -మాణికం ఠాకూర్

అమరావతి, జనవరి 11: రెండు సార్లు చంద్రబాబు పాలన, ఒక్కసారి వైఎస్ జగన్ పాలనను చూసిన ఆంధ్ర రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఛాన్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మాణికం ఠాకూర్.. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచారని విమర్శించారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ యువతకు ఉద్యోగాల కల్పనలో విఫలమయ్యారని ఆరోపించారు. ఏపీ వ్యవహారాల ఇంఛార్జ్‌గా నియమించిన తర్వాత తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ఆయన ఒంగోలులో మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నాలుగున్నరేళ్ళలో చేసిందేమీ లేదన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రానికి కావాల్సిన అన్నీ ప్రాజెక్టులు ఇస్తామని ఈ సందర్భంగా చెప్పారు. వైఎస్ షర్మిలకు కాంగ్రెస్‌లో సముచిత స్థానం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోని ప్రతీ ఒక్కరూ సాదరంగా షర్మిలను ఆహ్వానించారన్నారు. షర్మిలకు ఆంధ్ర ప్రదేశ్‌లో బాధ్యతలు అప్పగిస్తాం.. మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి ఎవరువచ్చినా సాదరంగా ఆహ్వానిస్తామని మాణిక్కం ఠాకూర్ వెల్లడించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు కూడా ఇచ్చే పరిస్థితి లేదని ఆయన మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం సాండ్, లాండ్, మైన్, వైన్‌లపై నడుస్తుందని ఆయన విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన అన్ని అవకతవకలపై విచారణకు కోరతామన్నారు.

ఏపీలోని రాజకీయ నేతలు.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మధ్య ఉన్న సంబంధాలను పోల్చిన ఠాకూర్.. బీ అంటే బాబు, పీ అంటే పవన్, జె అంటే జగన్.. ఏపీలోని ఈ కొత్త బీజేపీ ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం కూడా ఏపీ ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. సంక్రాంతి తర్వాత ఎన్నికలకు అన్ని విధాలుగా కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతుంది.. ఆంధ్రప్రదేశ్‌లో 25 ఎంపీ స్థానాలు గెలుస్తాం అనే ధీమా వ్యక్తం చేశారు.

## యువతకు ఎప్పటికీ స్ఫూర్తి ప్రదాత



చిరు ప్రాయంలో చిచ్చర పిడుగు
పసితనమందే ధ్యానంపై మక్కువ..
భగవంతుని తెలుసుకోవాలనే జిజ్ఞాస..
ఆధ్యాత్మికత పట్ల ఆసక్తి..
సన్యాసుల పట్ల, యోగుల పట్ల
అమితమైన ప్రేమ..
పేదరికంలో కూడా భగవంతునిపై
సడలని విశ్వాసం..
పస్తులున్నా దైవాన్ని నిందించని నిర్భరత్వం..
దేశమే అతని ఇల్లు -దేశంలోని ప్రజలంతా
అతని సోదర సోదరీ మణులు..
కాషాయ వస్త్రం,కమండలం, శిష్యగణమే
అతని ఆస్తి పాస్తులు..
'పేదవారి సేవతో భగవంతుని సేవ' అనే పదాన్ని
ప్రతిపాదించిన గొప్ప ధార్మికవేత్త..
'జీవుడే దేవుడు' అనునది ఆయన మంత్రం..
రామకృష్ణ పరమహంసకు ప్రియశిష్యుడు..
ఆయనకు ఆధ్యాత్మిక వారసుడు..
ధర్మ ప్రచారమే దైనందిన దినచర్య..
సర్వమత సామరస్యం అతని ప్రబోధం..
"ఆరంభం అతి స్వల్పంగా ఉందని నిరాశ పడవద్దు
ఘనమైన ఫలితాలు క్రమంగా సమకూరుతాయి
సాహసాన్ని ప్రదర్శించండి". అని
యువతలో ధైర్యాన్ని, చైతన్యాన్ని నింపాడు..
'సహచరులకు నాయకత్వం వహించాలనే
తలంపు వద్దు - వారికి వీూ సేవలను
అందించండి".
అంటూ - నాయకత్వ లక్షణాలను తెలిపాడు..
పాశ్చాత్య ప్రపంచానికి వేదాంత, యోగాలను
పరిచయం చేసాడు..
దేశ విదేశాలలో ఆదర్శంగా నిలిచాడు..
అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ యువతకు
స్ఫూర్తిప్రదాత..
'ఆయనే స్వామి వివేకానందలి..'!!
(జనవరి 12 జాతీయ
యువజన దినోత్సవం
సందర్భంగా..)

-కందాళ పద్మావతి
-తెలుగు పండితులు,
కామారెడ్డి జిల్లా.

## స్మార్ట్ కిడ్జ్‌లో ఘనంగా సంక్రాంతి సంబురాలు



ఖమ్మం, జనవరి 11:(నేటినిజం ప్రతినిధి): స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబురాలు ఆనందోత్సవాలతో నిర్వహించారు. పంచె కట్టు, సాంప్రదాయ చీరకట్టులో పాఠశాల చిన్నారులు ఈ వేడుకల్లో నూతన శోభను సంతరించుకున్నారు. విద్యార్థులంతా భోగిమంటలు వేసి ఉత్సాహంగా గడిపారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి, బొమ్మల కొలువు పెట్టారు. పాఠశాల ప్రాంగణమంతా అందమైన రంగవల్లులతో ముస్తాబు చేసి డు...డు..బసవన్నలా ఆటా పాటా, హరిదాసుల కీర్తనలు, కోడిపందాల జోరు, గాలిపటాల సందడి, గొబ్బెమ్మ పాటలతో వేడుకలు హోరెత్తాయి. ఈ సందర్భం గా పాఠశాల కరస్పాండెంట్ చింత నిప్పు కృష్ణచైతన్య మాటాడుతూ... తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతిని మూడు రోజులపాటు భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాలుగా జరుపుకుంటున్నామన్నారు. మన తెలుగు సాంప్రదాయాలను ముందు తరాలకు అందించడానికి ఈ సంక్రాంతి పర్వదిన వేడుకలు ఉత్సాహంగా ఉరూరా జరుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాల్లో పాఠశాల చిన్నారులు ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంది. వివిధ రకాల బొమ్మలను చిన్నారులు ఈ వేడుకల్లో పెట్టి సరదాగా గడిపారు. రంగురంగుల వివిధ వెరైటీ బొమ్మలు, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ బొమ్మలు, చెక్క బొమ్మలు, మట్టితో తయారుచేసిన బొమ్మలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ బొమ్మల కొలువు పాఠశాల చిన్నారుల సృజనాత్మకతకు అద్దం పట్టింది. బొమ్మల కొలువులో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

## ప్రైవేట్ యూనివర్సిటీల ఆర్డినెన్సును పునః సమీక్షించండి..

### -ఎస్సీ ఎస్టీ బీసీలకు రిజర్వేషన్లు అమలుచేయండి

### -ముఖ్యమంత్రికి బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ లేఖ

హైదరాబాద్ జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ యూనివర్సిటీ బిల్లు 2018 ద్వారా 5 ప్రైవేట్ యూనివర్సిటీలకు ఆమోదం తెలుపుతూ గత ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్సుతో ఎస్సీ ఎస్టీ బీసీలు ఆయా యూనివర్సిటీ ప్రవేశాలలో రిజర్వేషన్ అవకాశాలలను కోల్పోతున్నారనీ దీనిని ప్రభుత్వం వెంటనే పునః సమీక్షించి ఎస్సీ ఎస్టీ లతో బాటు బీసీలకు సహితం రిజర్వేషన్లు దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యాలయానికి పంపిన ఒక లేఖలో పేర్కొన్నారు.తెలంగాణ ఆవిర్భావం నుండి ప్రభుత్వాలు విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు.. ప్రభుత్వం ప్రాథమిక ,ఉన్నత,సాంకేతిక విద్య కోసం వెచ్చిస్తున్న బడ్జెట్ క్రమంగా క్షీణిస్తూ వస్తుందన్నారు.. 2014-15 వార్షిక బడ్జెట్లో 10.89 శాతం వెచ్చించగా 2022-23 నాటికి 6.24 శాతం అనగా 16 వేల 42 కోట్లు మాత్రమే కేటాయించిందని పేర్కొన్నారు. ఇందులో 1962 కోట్లు మాత్రమే ఉన్నత విద్యకు వెచ్చించి ప్రభుత్వం యువతకు నాణ్యమైన విద్యను అందించాల్సిన భాధ్యతను ప్రైవేట్ యూనివర్సిటీలకు కట్టబెట్టి చేతులు దులుపుకుంటున్నదని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ బీసీల సంక్షేమానికి వెచ్చించాల్సిన సబ్ ప్లాన్ నిధులను విద్యాశాఖకు తరలించామని 2019 లో మంత్రి సబితా ఇంద్రా రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భం గా ముఖ్యమంత్రి కి గుర్తుచేశారు. గత ప్రభుత్వం ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజు లపై నియంత్రణ లేకుండా మధ్యతర గతి కుటుంబాలకు విద్యను దూరం చేసే ప్రయత్నాలు చేసిందన్నారు.

## ఒక్కసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వండి... ప్రత్యేక హోదా ఇస్తాం -మాణికం ఠాకూర్



ఒంగోలు, జనవరి 11: రెండు సార్లు చంద్రబాబు పాలన, ఒక్క సారి వైఎస్ జగన్ పాలనను చూసిన ఆంధ్ర రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఛాన్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మాణికం ఠాకూర్.. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచారని విమర్శించారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ యువతకు ఉద్యోగాల కల్పనలో విఫలమయ్యారని ఆరోపించారు. ఏపీ వ్యవహారాల ఇంఛార్జ్‌గా నియమించిన తర్వాత తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ఆయన ఒంగోలులో మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నాలుగున్నరేళ్ళలో చేసిందేమీ లేదన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రానికి కావాల్సిన అన్నీ ప్రాజెక్టులు ఇస్తామని ఈ సందర్భంగా చెప్పారు. వైఎస్ షర్మిలకు కాంగ్రెస్‌లో సముచిత స్థానం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోని ప్రతీ ఒక్కరూ సాదరంగా షర్మిలను ఆహ్వానించారన్నారు. షర్మిలకు ఆంధ్ర ప్రదేశ్‌లో బాధ్యతలు అప్పగిస్తాం.. మల్లిఖార్జున ఖర్గే నేతృత్వంలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి ఎవరువచ్చినా సాదరంగా ఆహ్వానిస్తామని మాణిక్కం ఠాకూర్ వెల్లడించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు కూడా ఇచ్చే పరిస్థితి లేదని ఆయన మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం సాండ్, లాండ్, మైన్, వైన్‌లపై నడుస్తుందని ఆయన విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన అన్ని అవకతవకలపై విచారణకు కోరతామన్నారు.

ఏపీలోని రాజకీయ నేతలు.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మధ్య ఉన్న సంబంధాలను పోల్చిన ఠాకూర్.. బీ అంటే బాబు, పీ అంటే పవన్, జే అంటే జగన్.. ఏపీలోని ఈ కొత్త బీజేపీ ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కూడా ఏపీ ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. సంక్రాంతి తర్వాత ఎన్నికలకు అన్ని విధాలుగా కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతుంది.. ఆంధ్రప్రదేశ్‌లో 25 ఎంపీ స్థానాలు గెలుస్తాం అనే ధీమా వ్యక్తం చేశారు.

## సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయడమే నా జీవిత కాల కోరిక - మంత్రి తుమ్మల

సత్తుపల్లి, జనవరి 11: తనకు ఉన్న రాజకీయ కోరిక సీతారామ ప్రాజెక్ట్ పూర్తి చేయటమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామంలో ఇవాళ సీతారామ ప్రాజెక్ట్ పనులపై ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

అనంతరం తుమ్మల మాట్లాడుతూ.. గోదావరి జలాలు 10లక్షల ఎకరాలు ఇచ్చేందుకు తలపెట్టినది సీతారామ ప్రాజెక్ట్ అన్నారు. ఇప్పటికే 7 వేలకోట్లకు పైగా ఖర్చు జరిగిందన్నారు. టన్నెల్ రెండు వైపుల నుండి పనులు చేసి పూర్తి చేయాలన్నారు. టెక్నాలజీని ఉపయోగించి పనులు పూర్తి చేస్తున్నారని తెలిపారు. యాతలకుంట టన్నెల్ పూర్తి అయితే బెత్తుపల్లి, లంకా సాగర్ కు నీళ్లు అందుతాయన్నారు. గండుగలు పల్లిలో నాలుగో పంప్ హౌస్ పనులు జరుగుతున్నాయని తెలిపారు.

యాతాల కుంట టన్నెల్ ప్రధానమైందని అన్నారు. నిత్య పర్యవేక్షణతో అధికారులు పనులు పూర్తి చేయాలన్నారు. సత్తుపల్లి నియోజక వర్గానికి సీతారామ ప్రాజెక్ట్ లో ప్రధానమైంది యాతాల కుంట టన్నెల్ అని తెలిపారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులకు కోరారు. తనకు ఉన్న రాజకీయ కోరిక సీతారామ ప్రాజెక్ట్ పూర్తి చేయటమే అని అన్నారు. ఉభయ జిల్లాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పనులకు ఆటంకం కలగకుండా చూస్తానని తెలిపారు. సీతారామ ప్రాజెక్ట్ జిల్లా ప్రజల ఆశ..ఆకాంక్ష అన్నారు.



## పేబ్యాక్ దిసొసైటీ 2024 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణను విజయవంతం చేయండి



ఖమ్మం, జనవరి 11:(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం పే బ్యాక్ సొసైటీ, జంగం ఫ్యామిలీ క్యాలెండర్ ఆవిష్కరణ "పే బ్యాక్ టు సొసైటీ" "జంగం కుటుంబ"సభ్యులతో సంయుక్తముగా రూపొందించబడిన ఈ కార్యక్రమంలో పేబ్యాక్ టు సొసైటీ అండ్ జంగం ఫ్యామిలీ సభ్యులతో 2024 నూతన సంవత్సర క్యాలనీడర్ ఆవిష్కరణ కార్యక్రమము ఖమ్మం కోర్ట్ ఎదురుగా ఉన్న తెలంగాణా ఏజెన్సీ పై నున్న గ్లోబల్ రిషీ స్టడీ హాల్ లో ఈనెల 13వ తేదీన ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేయనైనది.

దీనికి రాష్ట్ర, జాతీయ అత్యుత్తమ ప్రతిభా అవార్డు గ్రహీత డా. వరికూటి సుబ్బారావు, తెలంగాణా హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పల్లె నాగేశ్వరావు, ట్రాన్స్కో చీఫ్ ఇంజనీర్ పిల్లి బాలరాజ్, ఆంధ్రా సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జంగం సంజీవరావు లతో ముఖ్య, విశిష్ట అతిధులుగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సొసైటీ అలాగే జంగం ఫ్యామిలీ సభ్యులైన ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులతో ఏర్పాటు చేయనైనది.

ఈ కార్యక్రమంలో ముఖ్యంగా "ఈ దేశాన్ని ప్రపంచాన్ని మార్చాలంటే అత్యంత శక్తీవంతమైన ఆయుధం చదువు ఒక్కటే" అని డా బిఆర్ అంబేద్కర్ పేర్కొన్నట్లు విద్య వైద్యం సామాజిక అంశాలపై చర్చించనున్నా మని సభ్యులు అందరూ సకాలంలో హాజరై ఇదే మా ఆహ్వానంగా భావించి కార్యక్రమా న్ని విజయవంతం చేయగలరని పే బ్యాక్ టు సొసైటీ స్థాపకులు, సభ్యులు జంగం లక్ష్మణ్ రావు, జమ్మి జైపాల్, జంగం కోటేశ్వరావు, నాగులపాటి శంకర్, చినీతమాల నాగేశ్వరావు, సిహెచ్ కనకయ్య, డి.పుల్లయ్య, జంగం చెన్నకేశవులు-సుధీర్, డా. స్వర్ణకుమారి-రత్నాకర్, బి. మోహన రావు, జి.సాయిబాబు, డా. కిరణ్ కుమార్, డా. శివకృష్ణ, ఎన్.రవీందర్, కందుల విజయ్, కొచ్చెర్ల శ్రీనివాస్, రత్నరాజ్, పి.శ్రీనివాస్ తదితరులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## తిరుపతి ఉప ఎన్నికల్లో జరిగిన భారీ మోసాలను బయటపెట్టిన ఎన్నికల కమిషన్

### - కేంద్ర ఎన్నికల కమిషన్ చెప్పిన లెక్కల ప్రకారం.. చర్యలుంటాయా..?

అమరావతి జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):ఎన్నికల అధికారులు.. ఏదైనా ఒక పార్టీకో.. ఎవరైనా ఒక అభ్యర్థికో అనుకూలంగా వ్యవహరిస్తే సహించేది లేదు.. అలాంటి వారిపై తీవ్రమైన చర్యలుంటాయి.. ఇవే ఎన్నికల ముందు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషన్ పదే పదే చెప్పే మాటలు. అయితే.. ఏపీలో అధికార వైసీపీ ఎన్నికలకు ముందే బోగస్ ఓట్ల విషయంలో దారుణాతి దారుణాలు పాల్పడుతుంటే ఇంతవంకూ చలీచ ప్పుడు లేదు. ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే.. తిరుపతి ఉప ఎన్నికల్లో జరిగిన భారీ మోసాలను ఎన్నికల కమిషనే బయటపెట్టింది. అంతేకాదు.. ఎన్నికల కమిషనర్ లాగిన్‌ను అధికార వైసీపీ నేతకు చేరింది. నాటి తిరుపతి మున్సిపల్ కమిషనర్ గిరిషా ఈ లాగిన్ ఇవ్వడంతో ఉప ఎన్నికల్లో భారీగానే డూప్లికేట్ ఓట్లు వచ్చిపడ్డా యి. వాస్తవానికి తిరుపతి సిట్టింగ్ ఎంపీ సీటును దక్కించుకోవడానికి నానా యాగీ చేసి చివరాకరికి ఈసీతో మొట్టికాయలు వేయించుకున్న పరిస్థితి. తెలిసినదే ఇంత అయితే.. ఇక ఇంతవరకూ జరిగిన ఎన్నికల్లో ఎన్నెన్ని అవకతవకలు వైసీపీ పాల్పడిందో ఒక్కసారి ఊహించుకోండి. వాస్తవానికి.. 2023 మొదటి నుంచీ ఓటరు జాబితాలను అధికార పార్టీ గల్లంతు చేస్తూనే ఉందన్నది జగమెరిగిన సత్యమే. ప్రతిసారి ఈసీ దెబ్బలు పడినా.. ఓటరు నమోదు ప్రక్రియలో అక్రమ చొరబాట్లను మాత్రం మానుకోలేదు.కేంద్ర ఎన్నికల కమిషన్ చెప్పిన లెక్కల ప్రకారం.. ఏపీలో మొత్తం ఓటర్లు : 4.07 కోట్ల మంది ఉండగా ఇందులో పురుషులు : 1.99 కోట్లు, మహిళలు : 2.07 కోట్లు, ట్రాన్స్ జెండర్లు : 3,486 వేలు, దివ్యాంగ ఓటర్లు : 4.76 లక్షలు, వయో వృద్ధులు 80 ఏళ్లు పైబడిన వారు : 5.8 లక్షల మంది, యుక్త వయసు వచ్చిన వారు : 7.88 లక్షల మంది ఉన్నారు. ఇక ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 870 నుంచి 1500 మంది ఉన్నారని కేంద్ర ఎన్నికల సంఘం సభ్యులే అధికారికంగా ప్రకటించారు. మరోవైపు.. ఓట్లు యాడింగ్ కోసం 17,76,850 మంది ఓటర్లు అప్లయ్ చేసుకున్నట్లుగా సమాచారం అందుతోంది. తిరుపతి ఎన్నికలతో బయటపడిన అక్రమాలపై ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకుంటుందా..? అనేది చూడాల్సి ఉంది.

## ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది

### -ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..

### -రోగులకు మెరుగైన సేవలు అందించడంలో వైద్యులదే ముఖ్యపాత్ర




రాజన్న సిరిసిల్ల, జనవరి 11:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ప్రతి వార్డును తిరుగుతూ రోగులకు అందుతున్న సేవలు గురించి స్వయంగా ఆయన అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం వైద్య రంగారనికి పెద్దపీట వేస్తుందని అన్నారు.ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ప్రజా ఆరోగ్యనికి భరోసా కల్పిస్తూ ఆరోగ్య శ్రీ పరిమితిని 10 లక్షల వరకు పెంచమని గుర్తు చేశారు.. ఆసుపత్రిలో వైద్య సేవలు అందించడంలో వైద్యులు ముఖ్యపాత్ర పోషించాలని ఎప్పటికప్పుడు ఏలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట ఏరియా హాస్పిటల్ సూపర్డెంట్ రేగులపాటి మహేష్ రావు, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, నాయకులు, చిలుక రమేష్, కని కరపు రాకేష్, తూమ్ మధు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కుటుంబానికి చెక్కుఅందజేసిన పోలీస్ కమిషనర్



ఖమ్మం, జనవరి 11:(నేటినిజం ప్రతినిధి): గత ఏడాది గుండెపోటుతో మరణించిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సైయద్ హసన్ ఆలీ కుటుంబ సభ్యులకు రూ.8 లక్షల రూపాయలు భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కును గురువారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...శాఖపరంగా ఎటువంటి సహాయ సహకారాలు అందించేందుకైన పోలీస్ అధికారులు అందుబాటులో వుంటారని అన్నారు. పోలీసు కుటుంబాలకు అన్ని విధాల ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో అక్తరూనీసాబేగం పాల్గొన్నారు.

## 'ప్రతి చేతికీ పని .. ప్రతి చేనుకీ నీరు' లక్ష్యం దిశగా జనసేన..టిడిపి ఉమ్మడి మేనిఫెస్టోపై చర్చ..



అమరావతి, జనవరి 11:జనసేన పార్టీ మేనిఫెస్టో రూపకల్పనపై చర్చ 'ప్రతి చేతికీ పని ? ప్రతి చేనుకీ నీరు' అనే లక్ష్యం దిశగా సాగింది. జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ గురువారం విజయవాడలో పార్టీ మేనిఫెస్టో కమిటీతో సమావేశం అయ్యారు. కమిటీ సభ్యులు ముత్తా శశిధర్, డి.వరప్రసాద్, ప్రొఫెసర్ కె.శరత్ కుమార్ ఈ చర్చలో పాల్గొన్నారు.

యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల మెరుగుదల, వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా నిలవడం, పేద ప్రజల సంక్షేమం, మహిళా భద్రత, రాష్ట్ర అభివృద్ధి తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రకటించిన షణ్ముఖ వ్యూహంలోని అంశాలను ఆధారంగా చేసుకొని రాష్ట్రంలోని ప్రతి వర్గం సంక్షేమాన్నీ దృష్టిలో ఉంచుకోవాలని ఈ సందర్భంగా నాదెండ్ల కమిటీ సభ్యులకు సూచించారు.

ఇటీవల తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో కమిటీ సభ్యులతో సమావేశమైనప్పుడు చర్చించిన అంశాలను జనసేన సభ్యులు వివరించారు. త్వరలో ఉమ్మడి మేనిఫెస్టో ప్రకటిస్తామని, ఇందుకు సంబంధించిన చర్చలు వేగవంతం చేయాలని మనోహర్ కోరారు..

### జనసేన మేనిఫెస్టో కమిటీకి వినతులు.. సూచనలు

జనసేన మేనిఫెస్టో కమిటీకి వివిధ వర్గాలు, సంఘాల నుంచి వినతులు, సూచనలు అందాయి. వాటిని ఈ సమావేశంలో పరిశీలించారు.

కాపు సంక్షేమ సేన తరఫున ఆ సంస్థ వ్యవస్థాపకుడు చేగొండి హరిరామ జోగయ్య పంపించిన పీపుల్స్ మేనిఫెస్టోపై చర్చించారు. జనసేన మేనిఫెస్టో కమిటీని ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్, పార్సిల్ లారీ అసోసియేషన్, ట్రాలర్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి రవాణా రంగంలోని సంక్షోభాన్ని తెలియచేస్తూ ఈ రంగాన్ని ప్రోత్సహించాలని కోరారు.

ఏపీ నిరుద్యోగ ఐక్య కార్యాచరణ సమితి ప్రతినిధులు తమ సమస్యలను, నోటిఫికేషన్లు విడుదల కాకపోవడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెల్లడించి వినతి పత్రం అందచేశారు.

## గీత విద్యా నికేతన్ పాఠశాలలో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



రాజన్న సిరిసిల్ల, జనవరి 11:(నేటినిజం ప్రతినిధి): సంక్రాంతి పండుగ సమీపిస్తుండడంతో వేములవాడ పట్టణం గాంధీ నగర్ లోని గీత విద్యానికేతన్ పాఠశాలలో గురువారం ముందస్తుగా పాఠశాల ప్రిన్సిపల్ గీతాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన సంక్రాంతి పండుగ సంబరాలు అంబరాన్ని అంటే విధంగా విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వివిధ వేషధారణ ద్వారా విద్యార్థులు వారి నైపుణ్యాన్ని ప్రదర్శించారు.

భోగి మంటలు వేయడం, హరిదాసుల వేషధారణలతో విద్యార్థులు డప్పు వాయిద్యాలు వాయిస్తూ, గంగిరెద్దుల తో బసవన్న నృత్యాలు చేయించడం,రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు తో అలంకరించడం, బెల్లమన్నం, బొప్పట్లు, భగవంతునికి నైవేద్యం సమర్పించి భోగి ,సంక్రాంతి, కనుమ తదితర పండగల ప్రత్యేకతను ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు గాంధీనగర్ వీధిలోని ప్రజలు తరలివచ్చి విద్యార్థుల ప్రదర్శన తీరుపై సంతృప్తి చెంది వారిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థినీలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రిన్సిపాల్ గీతాదేవి బహుమతులను ప్రధానం చేశారు. అలాగే విద్యార్థులు గాలిపటాలు ఎగురవేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ దేవి ప్రసాద్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



రాజన్న సిరిసిల్ల, జనవరి 11:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్లో గురువారం ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ముగ్గుల పోటీలలో పాల్గొని, రంగురంగుల ముగ్గులను వేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సుదీష్ కుమారి మాట్లాడుతూ విద్యార్థులకు సంక్రాంతి పండగ భోగి మంటలు, కనుమ విశిష్టతను వివరించారు. విద్యార్థులకు చదువుతోపాటు సాంస్కృతి సాంప్రదాయాల పట్ల అవగాహన ఉండాలనే ఉద్దేశంతో ప్రతియేట పాఠశాలలో వివిధ పండగల కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. భారతదేశ వ్యవసాయ ప్రధానమైన దేశమని, రైతే రాజు రైతు లేనిది వ్యవసాయం ముందుకు సాగదని, ఇలాంటి దేశంలో ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో బోగభాగ్యాలతో విరసిల్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ముద్ర కోల రాజు, అకాడమిక్ కోఆర్డినేటర్ పల్లె ప్రవీణ్, డీన్ పి శేఖర్, సి బ్యాచ్ ఇంచార్జ్ టీ అంజయ్య, ఏఓఏ సుధీర్, పిఈటి సుధాకర్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.